జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి- ఫిబ్రవరి 22న విజయవాడలో మహాధర్నా జయప్రదం చేయండి : గోడపత్రాల విడుదలలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాల్లో భాగంగా రాష్ట్రంలో అందరికీ ఇల్లు నిర్మాణం పేరుతో చేపట్టిన జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించి, ఇంటి నిర్మాణ సామగ్రి సిమెంట్, స్టీల్, ఇటుకలు,ఇసుక, కంకర, కిటికీలు,తలుపులు, లేబర్ వ్యయాన్ని పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.1 లక్ష 80 వేల నుండి 5 లక్షలకు పెంచాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని రాష్ట్ర వ్యాప్త దశల వారి పోరాటాలకు సమాయత్తం కాలనీ సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన గోడపత్రాల విడుదలలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాల్లో భాగంగా అందరికీ ఇల్లు అన్న నినాదంతో 2019 జూలై 1న రాష్ట్రంలో 9024 జగనన్న కాలనీలు, నాలుగేళ్లలో 27 లక్షల ఇల్లు నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ మొదటి విడత 2019 ఆగస్టు 26 నాటికి 15 లక్షల 03 వేల 810 ఇల్లు పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమయ్యింది అన్నారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు మంజూరు చేసినప్పటికీ కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణానికి అవసరమైన సామాగ్రి ధరల పెరుగుదల ప్రభావం లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు అన్నారు. కడప జిల్లాలో అన్నమయ్య అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ 33 వేల 016 ఇల్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో 62 వేల 633 ఇల్లు మొత్తం కలిపి 95 వేల 649 ఇల్లు మంజూరు చేసినప్పటికీ కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణానికి అవసరమైన సామాగ్రి ధరల పెరుగుదల ప్రభావం లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదన్నారు. జిల్లాలో 335 జగనన్న కాలనీల్లో 77వేల 290 మందికి పట్టాలు పంపిణీ చేశారని ఇందులో ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 7వేల418 మంది స్వంతంగా కట్టుకుంటామని, 29వేల 252 మంది సామాగ్రి ప్రభుత్వం ఇవ్వాలని, 45వేల 347 మంది ప్రభుత్వమే కట్టించాలని లబ్ధిదారుల్లో సగానికి పైగా ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలన్న డిమాండ్ ను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 1లక్షా 50 వెలు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 30 వేలు మాత్రమే ఇస్తే ప్రస్తుత ధరల ప్రకారం గునాది నిర్మాణం కూడా పూర్తి కాదు, ప్రభుత్వం కేవలం ఒక సెంటు (437 చదరపు అడుగులు) ఇస్తే అందులోనే కుటుంబం అంతా కుక్కిన జీవితాన్ని గడపాల్సి వస్తుంది, గ్రామీణ ప్రాంతాల్లో పాడి, పశువు పెంపకానికి అవకాశమే లేదు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు తక్షణం ఇంటి నిర్మాణం చేపట్టకపోతే రద్దు చేస్తాం అంటూ వాలంటీర్లు బెదిరించడంతో కాలనీల్లో మౌలిక అదుపాయాలయిన రోడ్లు, కరెంట్, నీళ్ళు లేకుండా ఏ విధంగా కట్టుకుంటారు అని ప్రశ్నించారు. కొన్నిచోట్ల కాంట్రాక్టర్లు ఇల్లు కట్టిస్తామంటు లబ్ధిదారులతో డబ్బులు వసూలు చేసి ఉడాయించిన ఘటనలు కూడా ఉన్నాయన్నారు. కొందరు రద్దు చేస్తారన్న భయంతో నిర్మాణం కోసం అధిక వడ్డీలకు తెచ్చి అప్పుల పాలయ్యారు అని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 మే 30 ప్రభుత్వం ఏర్పడే నాటికి 3,13,832 టిడ్కొ ఇల్లు నిర్మాణంలో ఉండగా 90శాతం పైగా పూర్తి అయినవి 81040, 75శాతం పైగా పూర్తి అయినవి 71,488, 25శాతం పైగా పూర్తయినవి 38416, 25శాతం పూర్తయినవి1,22,888 ఇల్లు నిర్మాణంలో ఉన్నాయనీ, ప్రభుత్వం మారడంతో 51,616 లబ్ధిదారులకు మంజూరైన ఇల్లు రద్దు చేయడంతో పాటు టిడ్కొ ఇల్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేయడం వల్ల కంపచెట్లతో సిదిలావస్తకు చేరుకుంటున్నాయి అన్నారు. పట్టణాల్లో బహుళ అంతస్తుల భవన సముదాయాలు నిర్మించిన చోట పార్కు, ఆటస్థలం, విద్యా, వైద్యం, ఉపాధి కి అవసరమైన స్థలాభివృద్ధి చేయడంలో తీవ్రంగా జాప్యం చేస్తున్నారు. సిపిఐ చేపట్టిన పోరాటాలకు స్పందించి 2022 డిసెంబర్ 23 నాటికి 46వేల మంది లబ్దిదారులకు స్వాధీనం చేశారు అన్నారు.పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇల్లు , ఇంటి స్థలం, రేషన్ కార్డు, పెన్షన్ తో పాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు 24 గంటలు త్రాగునీరు అందిస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలతో ఊదరగొట్టి తద్వారా ఓట్లు పొంది అందలమెక్కగానే విస్మరించడం పరిపాటిగా మారింది అన్నారు. సామాన్య పేద మధ్యతరగతి కుటుంబాల చిరకాల సొంతింటి కల దశాబ్దాలుగా నెరవేరక అధికారులు పాలకవర్గాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రోజువారీ కూలీకి పోయే వారు, ప్రవేటు షాపుల్లో, కంపెనీల్లో చిన్న, చిన్న ఉద్యోగాలు, వ్యాపారం చేసుకునేవారికి పెరిగిన ఇంటి అద్దెలు, ఖర్చులు తలకు మించిన భారంగా మారి ఒకే ఇంట్లో తల్లి దండ్రులతో పాటు పెళ్ళి అయిన కొడుకులు, కూతుర్లు రెండు మూడు కుటుంబాలు దుర్భర జీవనం సాగిస్తున్నారు.ఈ నేపథ్యంలో జగనన్న కాలనీ ఇంటి నిర్మాణ వ్యయాన్ని 1.80 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని జనవరి 17 నుండి ఫిబ్రవరి 22 వరకు సంతకాల సేకరణ, విజ్ఞప్తులు, జిల్లా సదస్సు, ఫిబ్రవరి 22 న విజయవాడలో జరుగు మహాధర్నా జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పి.కృష్ణమూర్తి, పి.చంద్రశేఖర్, బషిరున్నిస, సి. సుబ్రమణ్యం, మునేయ్య,నార్ల ప్రకాశం, బ్రహ్మం,నాగార్జున పాల్గొన్నారు.

ఘనంగా ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ జన్మదినం సందర్భంగా కడప నగరంలోని స్నేహాల య నిరాశ్రయ వసతి గృహం నందు కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డిలు హాజరయ్యారు. వృద్ధులకు అందరికీ పండ్లు పంపిణీ చేశారు. నిరుపేదలకు, బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలాదేవి, నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య, ప్రవళిక, తిరుమలేష్, ప్రసాద్ గౌడ్, శ్రీకాంత్, ప్రసన్న, సత్యం తదితర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

గిడ్డంగివారిపల్లెలో మినరల్ వాటర్‌ప్లాంటు ప్రారంభం

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె మండలం గిడ్డంగివారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అశోక్‌నగర్‌లో సుమారు రూ.8లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన మిన రల్ వాటర్‌ప్లాంటును గురు వారం జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలు ప్రారంభించారు. తదనం తరం వారు ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మీ గాయత్రి అక్కడున్న విద్యార్థులను ఆప్యాయత తో బాగా చదువుకుంటున్నారని పలకరించారు. మీకు పాఠశాలలో కోడిగుడ్లు చిక్కీలు ఇస్తున్నారని అంటూ చిరునవ్వుతో ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు రుద్రశివ, శంకర్ రెడ్డి, జరపాల వరాలమ్మ సర్పంచ్ పెన్నాపాటి మల్లయ్య, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

విశాలాంధ్ర - కడప కలెక్టరేట్ : స్థానిక ఆర్టీవో ఆఫీస్ దగ్గర ఉన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు, క్యాంపస్ ప్లేస్మెంట్ నిర్వహించడంలో విద్యా సంస్థల అధినేత చొప్ప గంగిరెడ్డి ముందుంటారని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదువుతూ తల్లితండ్రుల ఆశలను తమ ఆశయాలను చేరుకొని పాటుపడాలన్నారు, ముఖ్యంగా తమ కళాశాలలో ర్యాగింగ్ అనేది ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ విభాగాధిపతి శశి కుమార్, మురళీకృష్ణ, అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు పేద ప్రజలకు అండగా ఉండాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప కార్పోరేషన్ మేనేజర్ ఇనాయతుల్లాకి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సానపు రెడ్డి శివకోండారెడ్డి, జలతోటి జయకుమార్ వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలోని 17వ డివిజన్ ముసల్‌రెడ్డి పల్లె గ్రామం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అక్కడి ప్రజలకు అన్యాయం జరగకుండా కార్పొరేషన్ అధికారులు విస్తరణ పేరుతో సరైన కొలతలు లేకుండా రోడ్డు పాయింట్ ఫిక్స్ చేయకుండా చిన్న చిన్న వ్యాపారస్తులను భయ భ్రాంతులకు గురి చేస్తూ మార్కింగ్ విషయంలో కార్పొరేషన్ సర్వేయర్‌తో పాటు జిల్లా సర్వేయర్‌ను ఏర్పాటు చేసి ప్రజలందరికీ న్యాయం చేకూరాలని అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాయకుండా రైల్వే గేటు నుండి భాకరాపేట సోమవాండ్లపల్లి మామిళ్ల పల్లె మీదుగా రింగ్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డ్ ఇన్చార్జ్ మునీంద్ర యాదవ్, నాయకులు గంగాధర్, మేకల వెంకటేష్ యాదవ్, రెడ్డయ్య యాదవ్, కొండ్రెడ్డి జనార్దన్ రెడ్డి, రమేష్ బాబు, ధనుంజయ్, సుబ్బరాయుడు యాదవ్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-అట్లూరు : మండలంలోని చింటువాండ్లపల్లె గ్రామానికి చెందిన తప్పెట గంగిరెడ్డి చిన్నవయసులో అకాల మరణం చెందడంతో వారి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల వైసీపీ నాయకులు పోతిరెడ్డి రెడ్డయ్య పేర్కొన్నారు. అనంతరం విశాలాంధ్ర విలేకరితో మాట్లాడుతూ తప్పెట గంగిరెడ్డి వర్ధంతి సందర్భంగా మండలస్థాయి క్రికెట్ పోటీలు నల్లగొండుగారిపల్లె గ్రామానికి చెందిన కాసల అయ్యవారయ్య మనువళ్లు మల్లేష్, విష్ణు సహకారంతో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అబ్బిరెడ్డి స్వామి గుడి వెనుక 24 టీమ్‌లతో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోతిరెడ్డి రెడ్డయ్య మాట్లాడుతూ ప్రపంచంలో క్రికెట్ ముఖ్య క్రీడగా మారిందన్నారు. యువత విరివిగా క్రీడల్లో పాల్గొని శారీరక మానసిక ఉల్లాసం పొందాలన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.15116లు, రెండవ బహుమతి రూ.10116లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాసల అయ్యవారయ్య, ఫీల్డు అసిస్టెంట్ నారాయణ, బోవిళ్ల హరికృష్ణారెడ్డి, బోవిళ్ల రాధాకృష్ణారెడ్డి, యువకులు పాల్గొన్నారు.

సాంఘిక దురాచారాలను విడనాడాలి

విశాలాంధ్ర-వేంపల్లె: ఆరుబయట మలమూత్ర విసర్జన, బహిర్భూమి వంటి సాంఘిక దురాచారాలను విడనాడాలని తాళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మెల్) యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం వేంపల్లె -8 సచివాలయం పరిధిలోని పక్కీరపల్లె అంగన్వాడీ కేంద్రం దగ్గర సార్వత్రిక వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుబయట మలమూత్ర విసర్జన, బహిర్భూమి వంటి కాలకృత్యాలను ప్రభుత్వం నిషేదించిందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్డిని ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. మలవిసర్జన బహిర్భూమిలో చేయడం మహిళలకు, పురుషులకు అవమానకరంగా ఉంటుందని, అనారోగ్యానికి గురికావలసి వస్తుందన్నారు. బహిర్భూమిలో మలవిసర్జన చేయడంతో పరిసరాలు పరిశుభ్రంగా లేకుండా కలుషితమై వివిధ రకాల వ్యాధులకు గురిచేస్తాయన్నారు కార్యక్రమంలో వేంపల్లె సచివాలయం సిహెచ్‌వో బసయ్య, ఏ.యన్.యం డి.అంజనమ్మ, అంగన్వాడీ టీచర్ యస్.దిల్షాద్, ఆశా కార్యకర్త పి.జెమీన తదితరులు పాల్గొన్నారు.

కడప బుగ్గ వంక బ్రిడ్జిలు వెంటనే నిర్మించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నగరంలోని షహమీరియా మసీదు వద్ద ఉన్న మురా దియా నగర్ గుర్రాల గడ్డకు అనుసంధానంగా ఉన్న బ్రిడ్జితో పాటుగా బాదుల్లా సాహెబ్ మకాన్ వద్ద ఉన్న నాగరాజు పేట రవీంద్ర నగర్‌కు అనుసంధానంగా ఉన్న మరో బ్రిడ్జిని వెంటనే ప్రభుత్వం నిర్మించాలని రాజకీయ పార్టీల నాయకులు మూకుమ్మడిగా డిమాండ్ చేశారు. కడప ప్రెస్ క్లబ్‌లో గురువారం బ్రిడ్జిల నిర్మాణంపై రాజకీయ పార్టీల నాయకులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీఖాన్, మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి, ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు అందరూ సదరు బ్రిడ్జిలను వెంటనే నిర్మించకపోగా నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. కడప డిప్యూటీ సీఎం అంజాద్‌భాష, నగర మేయర్ సురేష్‌బాబు నిర్లక్ష్యం చేస్తూ రెండు బ్రిడ్జిలను నిర్మించకుండా రక్షణ గోడలు నిర్మించడం దారుణమన్నారు. మొత్తం కొన్ని వేల మంది జనాభాకు తీవ్ర అంతారాయం కలిగిస్తున్నారు. బ్రిడ్జిల నిర్మాణం పై నోరు విప్పితే అణగదొక్కెందుకు చేస్తున్న రాజకీయ ఒత్తిళ్లు మానుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ నేత వెంకటశివ, సిపిఎం నేతలు నారాయణ, రామ్మోహన్, ఎన్ఆర్సి జేఏసీ జిల్లా కన్వీనర్ బాబుభాయ్, జనసేన నేత గౌస్‌బాషా, ఆమ్ ఆద్మీ పార్టీ నేత శ్రీనివాసు లు, లోక్‌సత్తా నాయకుడు కృష్ణయ్య, తెలుగుదేశం పార్టీ నేతలు వివిఎస్ అమీర్ బాబు, హరిప్రసాద్, బీఎస్పీ నేత గుర్రప్ప, స్థానిక బాధిత ప్రజల ప్రతినిధి హమీద్, ఎంఆర్ఎఫ్ నాయకుడు, షేక్ దస్తగిరి, ఆవాజ్ నాయకులు మక్బూల్ భాష, ముస్లిం పోరాట సమితి నాయకుడు రఫీ, బీఎస్పీ నేత గుర్రప్ప, హేతువాదుల సంఘం, సిఆర్‌వి ప్రసాద్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి పూర్వ విద్యార్థులచే ఘన సన్మానం

విశాలాంధ్ర-కాశినాయన : ప్రకాశం జిల్లా గిద్దలూరు లోని శ్రీ వివేకానంద ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల పూర్వపు విద్యార్థులు ఈరోజు స్వామి వివేకానంద 161వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ సేవలందించినందుకు అభాగ్యులకు ఆపరేషన్ అనాధశవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నందుకు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ తరపున చేస్తున్న పలు సేవా కార్యక్రమాలు యువతకు నాయకత్వ లక్షణాలు వచ్చే విధంగా తయారు చేస్తున్నందుకు, ఆధ్యాత్మికంగా ప్రజలు ఆనందంగా సంతోషంగా జీవిస్తూ నవ్వుతూ ఉండే విధానం నేర్పిస్తున్నందులకు పూర్వ విద్యార్థులలో ఒకరైన మాజీ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కేపి కాశయ్య ఎస్పై సిఆర్పిఎఫ్ జూబ్లీహిల్స్ చేతుల మీదుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘసేవకులను ఘనంగా సన్మానించారు.

స్వామి వివేకానందకి ఘన నివాళి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : స్వామీ వివేకానంద జయంతి సందర్భంగా కడప నగరంలో తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి స్వామి వివేకానంద పటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన స్వామి వివేకానంద ను నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. అనంతరం నారా లోకేష్ యువగళం పోస్టర్ విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియాఉద్దిన్, కడప నగర తెలుగు యువ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి కోసం మరో విప్లవాత్మకమైన ఉద్యమం

చంద్రబాబును మద్దతు కోరిన కుంచం

విశాలాంధ్ర-పులివెందుల: రాయలసీమ రైతులకు సంబంధించి సాగునీటి కోసం మరో విప్లవాత్మకమైన ఉద్యమం చేపట్టనున్నట్లు ఆ మేరకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దతు కోరినట్టు రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షులు కుంచం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు ఆయన నివాసంలో బుధవారం వినతి పత్రం అందజేశామని తెలిపారు ఆయన మాట్లాడుతూ పాలకుల అసమర్థ విధానాల వల్ల సాగునీటి రంగంలో సీమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. చాలా కాలం పాటు తాము వేచి ఉన్నానని, కానీ ఇంత వరకు పాలకులలో మార్పు రాలేదన్నారు. ఇక ఓర్పు నశించడంతో తిరిగి సీమలోని ప్రజాప్రతినిధులందరినీ కలుపుకుని రాజకీ యాలకు అతీతంగా ఉద్యమం చేపడతామన్నారు. ఇప్పటికే మేధావులు, న్యాయ కోవిదులు, ఉద్యోగ, ఉపాధ్యా, విద్యార్థి, కార్మిక సంఘాలు సంఘీ భావం తెలిపాయన్నారు. సీమకు నికరజలాల కేటాయింపు విషయంలో అందరూ రాజకీయాలకు అతీతంగా పోరాడాలని, అలా పోరాడని వారు చరిత్రలో హీనులుగా మిగిలిపోతారన్నారు. అలాగే నిమ్మకునీరెత్తినట్లు ఉంటే రాయలసీమ ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని కుంచం హెచ్చరించారు.

రైతు సంఘం 2023 క్యాలెండర్ విడుదల

విశాలాంధ్ర-కాశినాయన : ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం కడప జిల్లా సమితి రూపొందించిన 2023 వ సంవత్సర క్యాలెండర్లను మండల కేంద్రమైన నరసాపురంలో మండల తాసిల్దార్, రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎదురు సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్వో బి.రామచంద్రుడు మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో రైతులు రైతు కూలీలు సుభిక్షంగా సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎదురు సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో రైతులకు పంటలు బాగా పండి మంచి గిట్టుబాటు ధర లభించి రైతులందరూ లాభాల బాటలో పయనించాలని , రైతే రాజు అవ్వాల ని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ బద్వేల్ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ రైతు సంఘం కాశీనాయన మండల నాయకులు ఎదురు చెన్నారెడ్డి , కిరణ్ కలసపాడు మండల కార్యదర్శి జాకోబ్, బీ కోడూరు నాయకులు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వస్తువులను అందించాలి



విశాలాంధ్ర-పులివెందుల: వ్యాపార రంగంలో నాణ్యమైన వస్తువులను అందించి మన్నలను పొందాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, తొండూరు మండల వైసీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డిలు అన్నారు. పట్టణ పరిధిలోని నారాయణ కళాశాల సమీపంలో గజ్జల నాగార్జునరెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన అశ్వర్థ సాయిగ్లాస్ షోరూమును గురువారం వారు ప్రారంభించారు. ఇచ్చింగ్ గ్లాస్, యసిడ్ వర్క్, విపివిస స్లాడింగ్ విండ్స్,ఎలివేషన్‌గ్లాస్, పార్టిషన్‌గ్లాస్, లఫ్‌వన్‌గ్లాస్ ఇంటీరియల్ గ్లాస్, ఉడ్‌వర్క్ తదితర సామానులు ఏర్పాటు చేయడం పట్ల వారు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వైసీపీ నాయకులు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బాబురెడ్డి, పౌరసరపరాల రాష్ట్ర డైరెక్టరు హాలు గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతరానికి స్ఫూర్తి స్వామి వివేకానంద

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన స్వామి వివేకా నందను నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం వివిఆర్ ఎస్టీయు భవన్, కడప నందు నిర్వహించిన యువజనోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి యువకులు దేశభక్తిని పెంపొందిం చుకుని, చెడు అలవాట్లకు లోనుకాకుండా దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ఎటువంటి ప్రసార సాధనాలు లేని కాలంలోనే వివేకానందుడు తన వాగ్ధాటితో ప్రపంచాన్ని కట్టి పడేశారన్నారు. నేటి యువత విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి వినియోగించేలా కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రఘునాథరెడ్డి, సుబ్రమణ్యంరాజు, గురు కుమార్, ఇలియాస్ భాష, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మహబూబ్ భాష, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జామ్మియా మసీదు ఆస్తులు వక్ఫ్‌బోర్డ్‌కు అప్పగింత

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలోని గవిని సర్కిల్‌లో ఉన్న జామ్మియా మసీదుకు చెందిన ఆస్తులను కమిటీ సభ్యులు వక్ఫ్‌బోర్డ్ అధికారులకు అప్పగించారు. గురువారం సాయంత్రం జామ్మియా మసీదులో కమిటి సభ్యులు వక్ఫ్‌బోర్డ్ అధికారులు షేక్ గౌస్‌బాష, షేక్ అన్వర్, సుల్తాన్‌లకు అందచేసిన అనంతరం జామ్మియా మసీదు కమిటీ అధ్యక్షుడు బేపారి బషీర్ ఆహమ్మద్ మాట్లాడుతూ తాను జామ్మియా మసీదు కమిటి అధ్యక్షులుగా ఎన్నికైనప్పటి నుండి మసీదు అభివృద్ధితో పాటు, మసీదుకు చెందిన ఆస్తులను పరిరక్షిస్తూ వస్తున్నానని తెలిపారు. 2021 నవంబర్‌లో కమిటీ సభ్యుల కాలం ముగిసిందన్నారు. కమిటీని రెన్యువల్ చేయాలని అధికారులకు కోరడం జరిగిం దన్నారు. జామ్మియ మసీదుకు అనుసంధానమైన స్థిరాస్తులు మరియు రికార్డులను జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధికారులకు అందించడం జరుగుతుందన్నారు. జామ్మియా మసీదుకు చెందిన 88షాపు రూములు, 2పాఠశాల భవణములు, ఒక ఫంక్షన్ హాల్, 3ఇంటి దస్తావేజులు, బ్యాంక్‌లో ఉన్న నగదు జమ వివరాలు, షాపు రూముల బాడుగ వివరాలు, మసీదులో పనిచేసే వారి వివరాలు, విద్యుత్ బిల్లుల చెల్లించిన రసీదులు, ఆస్తిపన్ను, నీటి పన్నుల వివరాలు, కోర్టులో ఉన్న కేసుల వివరాలు, మసీదు ఆస్తుల భూ కబ్జాల కోర్టులో దాఖలు చేసి గెలిచిన తీర్పు వివరాలతో పాటు రూ.34వేల నగదును కమిటీ సభ్యులు ద్వారా అధికారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డ్ ఇన్స్‌పెక్టర్ షేక్ గౌస్‌బాష మాట్లాడుతూ జామ్మియా మసీదుకు చెందిన ఆస్తులను రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. ఇకపై మసీదు నిర్వహణతో పాటు అన్ని లావాదేవీలు వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. జామ్మియా మసీదు కమిటి సెక్రటరీ వర్ల బాబా, బాష, మెంబర్లు దస్తగిరిబాషా, బేపారి గౌస్‌బాష, ఇమాం, అబ్దుల్‌మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పాలన : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్ర పరిధిలోని తోట్లపల్లె పంచాయతీలోని పాపిరెడ్డిపల్లెలో బీసీ కాలనీ, ఎస్సీకాలనీ, కొత్తపల్లె గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని తమ ప్రభుత్వమే ధ్యేయంగా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఆ గ్రామ సమస్యలు, గ్రామాల అభివృద్ధి పైన గడప గడపకు వైఎస్సార్ కార్యక్రమం ద్వారా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, స్థానిక సర్పంచ్ రాయపురెడ్డి లక్ష్మిదేవి, ఎంపీటీసీ సభ్యులు రామసుబ్బమ్మ, జడ్పీటీసీ ముత్యాల రామగోవిందారెడ్డి, మండల అధ్యక్షులు వీరనారాయణ రెడ్డిలు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ తోట్లపల్లె పంచాయతీకి సంక్షేమ పథకాల కొరకు దాదాపు రూ.7కోట్లకు పైగా కేటాయించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంక్ చైర్మెన్ సుబ్బారెడ్డి, మండల అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి, ఇంచార్జ్ తహసీల్దార్ రమేష్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ ప్రతాప్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, వెలుగు ఏపీఎం ప్రకాష్‌రావు, ఉపాధి ఏపీఓ వసంతకుమార్, సర్పంచ్ రామయ్య, ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, వైకాపా నాయకులు కిట్టు(నరసింహారెడ్డి), ఎంపీటీసీ భర్త ఓబుల్‌రెడ్డి, చిన్న(వెంకటసుబ్బారెడ్డి) సచివాలయం కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది,పాల్గొన్నారు.

జీవోనంబరు-1లో ఏముందో తెలుసుకోవాలి

నాగబాబు వ్యాఖ్యలకు కౌన్సిలర్ల కౌంటరు

విశాలాంధ్ర-పులివెందుల: రోడ్‌షోలు, సభలు, సమావేశాలు నిర్వహించే విషయమై ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోనంబరు-1లో ఏముందో సినీ నటుడు నాగబాబు తెలుసుకుంటే మంచిదని వైసీపీ కౌన్సిలర్ మూలి గంగామహేశ్వరరెడ్డి, కో ఆప్షన్ మెంబరు దాసరి చంద్రమౌళిలు హితవు పలికారు. జీవో నంబరు-1పై నాగబాబు చేసిన వ్యాఖ్యలకు గురువారం వారు ఘాటుగా కౌంటరు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదట జీవోనంబర1 లో ఏముందో అర్థంచేసుకుని మాట్లాడితే హుందాగా ఉంటుందని,.అరకొర జ్ఞానంతో అందులో ఏముందో తెలియ కుండా మాట్లాడితే నవ్వుల పాలవుతారన్నారు. ప్రజా పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం తెచ్చిన జీవోకు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రహదారులపైన కాకుండా బయట సభలు సమావేశాలు జరుపుకోవాలి అని ఉందన్నారు. ఆ జ్ఞానం కూడా లేకుండా మాట్లాడుతున్నావంటే ఎంత అవివేకివో అర్థమవుతుందన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ కోట్ల రూపాయలు ప్యాకేజీ తీసుకుంటూ ఆంధ్రప్రదేశ్ లో రాజకీయం చేయడం కాదని మీరు నిఖార్సయిన రాజకీయ నాయకులయితే ఆంధ్రలో ఓటు నమోదు చేసుకొని ఇక్కడే నివాసం ఉంటూ ప్యాకేజీ కోసం కాకుండా ప్రజల బాగు కోసం రాజకీయం చేయాలని సూచించారు. ఇటీవలి కాలంలో మీ దత్త తండ్రి సభలో 11 మంది ప్రాణాలు పోతే మాట్లాడలేని మీరు జీవోనంబరు1 మీద మాట్లాడటం సిగ్గులేదా అని ప్రశ్నించారు. ఇంత నీచంగా బానిస బతుకులు బ్రతుకుతున్నారు అని మీ కాపు జాతి సిగ్గుతో తల దించుకొంటోందన్నారు. మీకు నిజంగా ప్రజలకు సేవ చేయాలి ,మంచి జరగాలి అంటే ఒంటరిగా పోటీ చేసి గెలవండవని సవాల్ విసిరారు. అంతే కానీ ప్యాకేజీ కోసం జీ హుజూర్ అంటూ చంద్రబాబు కాళ్ళ మీద పడి బతకడం మంచిదికాదన్నారు. మీ తమ్ముడు కానీ నీవు కానీ ఏనాడైనా మేము అధికారంలోకి వస్తె ప్రజలకు ఇది చేస్తాము అని చెప్పిన సందర్భం ఉందా అని ప్రశ్నించారు. గతంలో 500 కోట్లకు అమ్ముడుపోయిన మీరు ఇప్పుడు 1000 కోట్లకు అమ్ముడుపోయి మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. ఇప్పటికైనా జీవోను అర్థం చేసుకుని వ్యాఖ్యలు చేస్తే ప్రజలు క్షమిస్తారని హితవు పలికారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



ఎస్పీ చేతులమీదుగా రివార్డ్ అందుకున్న సీఐ రాజారెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: నాప్టోల్‌లో లాటరి తగిలిందంటూ ప్రోసెసింగ్ ఛార్జీల పేరిట అమాయక ప్రజల నుండి డబ్బులు దోచుకుంటున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన మోస్ట్‌వాంటెడ్ సైబర్ క్రిమినల్, అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాడు అయిన శంకర్ మండల్‌ను అరెస్ట్‌చేసిన వన్‌టౌన్ సీఐ రాజారెడ్డిని జిల్లా ఎస్పీ కేకే అన్బురాజన్ అభినందించి రివార్డును అందచేశారు. అదేవిధంగా సీఐ రాజారెడ్డి ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి వద్ద నుండి రూ.16లక్షల మేర ఆన్‌లైన్ ద్వారా బ్యాంక్ ఖాతాకు పలు దఫాలుగా డబ్బులు దండుకొని మోసం చేసిన సైబర్ నేరగాళ్లను సీఐ రాజారెడ్డి పట్టుకున్నారు. అతను 23బ్యాంక్ ఖాతాల ద్వారా రూ.12కోట్లు మేరకు బాధితులను మోసం చేసినట్లు సైబర్ పోలీసులు గుర్తించారని అన్నారు. అతనిపై ప్రొద్దుటూరుతో పాటు విశాఖపట్నంలో రెండు కేసులు, చిత్తూరు జిల్లాలో ఒక కేసు నమోదు అయినట్లు తెలిపారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) తుషార్ డూడి ఐపీఎస్, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణ్‌కుమార్ ఐపీఎస్ పర్యవేక్షణలో కేసును చేధించి మోస్ట్‌వాంటెడ్ సైబర్ నేరగాణ్ని అరెస్ట్ చేసిన సీఐ రాజారెడ్డి, సైబర్ క్రైం ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌నాయుడు, వన్‌టౌన్ ఎస్ఐ మంజునాథ, ఏఎస్ఐ ఇబ్రహీంలను అభినందించి నగదు, రివార్డులను ఎస్పీ అన్బురాజన్ అందచేశారు.

అధిక ధరలను నియంత్రించండి

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలో సినిమా టికెట్ల అధిక ధరలను నియంత్రించాలని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో గురువారం ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ సినిమా విడుదలైందంటే ప్రేక్షకులు ఎగబడతారన్నారు. ఇదే అదునుగా భావించిన థియేటర్ యజమానులు టికెట్ల ధరలను అమాంతం పెంచి జేబులు నింపుకుంటారన్నారు. బుధవారం విడుదలైన సినిమా టికెట్ ధర రూ.300లకు పైబడ వసూలు చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ సొంత పట్టణంలో ప్రభుత్వ ధరలకు విక్రయించాల్సిన టికెట్లను నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా సినిమా థియేటర్ యాజమాన్యం స్పందించి ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే టికెట్లను విక్రయించాలని ఆయన డిమాండ్ చేశారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: స్థానిక శిల్పారామంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు పరిపాలనాధికారి సుధాకర్ తెలిపారు. ఆ మేరకు ఆయన శిల్పారామంలో గురువారం సంబరాల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14బోగి, 15సంక్రాంతి, 16 కనుమ పర్వదినాలకు పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు సాయంత్రం 5నుంచి రాత్రి 8గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న పులివెందుల డిజె డ్యాన్స్ అకాడమీ, 15 ఎస్‌కె డ్యాన్స్ స్టూడియో, 16న రాజా కళానిలయం వారి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు పారిశ్రామికవేత్త కోలా ప్రసాద్, బలిజసంఘం అధ్యక్షుడు గూడూరు ప్రసాద్‌లు సహకారం అందించినట్లు సుధాకర్ వెల్లడించారు. పట్టణ ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన దళిత నాయకులు పల్లెకొండు సంపత్ కుమార్ ను రైల్వే కోడూరు వైసీపీ నగర మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. తదనంతరం జై భీమ్ మాల.మహాసేన ప్రధాన కార్యదర్శి చైతల్య లక్ష్మీకి భారత రాజ్యాంగం బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్ర పటాన్ని అందజేసి దళితులు అందరూ ఐక్యంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

రికార్డుల తనిఖీ

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధిలోని వెంకటాపురం వార్డు సచివాలయంలో గురువారం మునిసిపల్ కమిషనర్ వి వి నరసింహ రెడ్డి రికార్డులను తనిఖీ చేశారు. ముఖ్యంగా సచివాలయం సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సచివాలయం ద్వారా సర్వీసులను పెంచాలని ఆయన ఉద్యోగులకు సూచించారు. .జగనన్న హౌసింగ్ కాలనీలో ఇండ్లు పొందిన లబ్ధిదారులతో చెల్లించాల్సిన రూ.35వేల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన ఆదేశించారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయం సిబ్బంది విధుల యందు నిర్లక్షం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ విజయం తథ్యం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ విజయం తథ్యమని చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావడం నూటికి నూరుశాతం నిజమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ అన్నారు. ఆమెకు రాష్ట్ర టీడీపీ పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలిసి నియోజకవర్గ పరిస్థితుల ను ఒంటిమిట్ట మండల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకు జగన్ ప్రభుత్వం గ్రాఫ్ పడిపోతోందని వారికి ఓటమి భయం చుట్టుకొని చీకటి జీవో నెంబర్‌వన్‌ను తేవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఓబినేని సుబ్బమ్మ అన్నారు.రాష్ట్రంలో ర్యాలీలు, సభలు, రోడ్‌షోలు చేయనీయకుండా జగన్ మోహన్‌రెడ్డి నిరంకుశ పాలనకు ఈ జీవో నిదర్శనమని తెలిపారు. సంక్షేమం పేరుతో కార్పొరేషన్లను దిగజార్చి నిధులు లేకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీలను మోసం చేశారని ఆమె విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గం నుంచి రాజంపేట అసెంబ్లీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్‌రాయుడు టీడీపీఎమ్మెల్యేగా విజయం తథ్యమని అలాగే రాజంపేట పార్లమెంటు ఇన్‌చార్జి గంటా నరహరి ఎంపీగా విజయం నల్లేరు మీద నడకని ఆమె జోష్యం చెప్పారు.

టీచర్ల పదోన్నతులు కల్పించాలి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : పీఆర్‌సీ ఉద్యమ సమయంలో సంఘాలతో చర్చలు జరిపే సమయంలో 35వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించి, మూడు నుండి పది తరగతుల పిల్లలందరికీ సబ్జెక్టు టీచర్లతోనే బోధన చేయిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఏడాది కావస్తున్నా ఒక్క పదోన్నతి చేపట్టకపోవడం అన్యాయమని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం వివిఆర్ ఎస్టీయు భవన్, కడప నందు నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీన ప్రక్రియ పేరుతో ప్రాథమిక పాఠశాలల యందు పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకుండా,కేవలం సర్దుబాటు పేరుతో ఎస్జీటి కేడర్ లోని ఉపాధ్యాయులతోనే పనిచేయిస్తూ, కాలం వెళ్లబుచ్చడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ప్రస్తుతం పని సర్దుబాటు పేరుతో పదోన్నతుల ప్రక్రియను పక్కన పెట్టి, కేవలం నెలకు రెండువేల ఐదువందల రూపాయలు ప్రత్యేక అలవెన్సు ఇచ్చి ఎస్జీటీ క్యాడర్ లోనే, స్కూల్ అసిస్టెంట్ గా బోధన చేయమని చెప్పడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలన్నారు. కోర్టు కేసులు తేలేవరకు అడ్హక్ పదోన్నతులు చేపట్టి న్యాయం చేయాలే తప్ప ఇలా అసంబద్ధమైన పని సర్దుబాటు పదోన్నతుల ప్రక్రియ కారణంగా ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళంలో ఉన్నారన్నారు. రాష్ట్ర నాయకులు మల్లు రఘునాథరెడ్డి, సుబ్రమణ్యం రాజులు మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుండి పదోన్నతులు, బదిలీలు, పని సర్దుబాటు, ఫేసియల్ అటెండెన్స్, యాప్‌ల నిర్వహణ వంటి రకరకాల కారణాలతో ఉపాధ్యాయలోకం తీవ్ర మానసిక గందరగోళంలో కొట్టుమిట్టాడుతుంటే, ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. వెంటనే ఈ ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు. ఇదే ధోరణి కొనసాగితే ఆందోళన చేపట్టక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి, రాష్ట్ర నాయకులు గురుకుమార్, ఇలియాస్ భాష, జిల్లా నాయకులు మహబూబ్ భాష, సుబ్బారెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 1 రద్దు చేసే వరకు పోరాటం : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కడప నగరం లోని ఆర్డీవో ఆఫీస్ దగ్గర ఏఐటీయూసీ కడప నగర కమిటీ ఆధ్వర్యంలో జీవో నెంబర్ ఒకటి కాపీలను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చేందుకు పాదయాత్రలు ఓదార్పు యాత్రలు రోడ్ షోలు, రోడ్లపై సభలు సమావేశాలు దీక్షలు చేయచ్చు కానీ జగన్ అధికారంలో ఉంటే ప్రతిపక్షాలు ప్రజలు చేయకూడదా? రాజ్యాంగం నీ ఒక్కనికే హక్కులు కల్పించలేదని అందరికీ సమాన హక్కులు కల్పించిందన్న విషయం జగన్మోహన్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రజలలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి మైన్, వైన్, ల్యాండు, శాండు మాఫియా అధికార పార్టీ అండదండలతో యదేచ్ఛ గా దోపిడీ చేస్తా ఉందన్నారు. పాలనలో జగన్ వైఫల్యాలు అనేకమని వాటిని ప్రతి పక్షాలు, ప్రజాసంఘాలు ప్రజలు వ్యతిరేకించకుండా ఉండేందుకు రాష్ట్రంలో ప్రదర్శనలు, సభలు సమావేశాలు, నిరసనలు నిషేధిస్తూ తక్షణమే జీవో నెంబర్ ఒకటిని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతా మని జీవో కాపీలను దగ్ధం చేసి నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లింగన్న, నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి, నగర అధ్యక్షుడు పిచ్చినేని సుబ్బారాయుడు, నగర నాయకులు ఆర్.బాబు, గంజికుంట నాగరాజు, నారాయణ,భీమరాజు, నాగిరెడ్డి, మురారి,శ్రీను వాసులు రెడ్డి, కృష్ణ రెడ్డి, శివ కుమార్,ఓబయ్య,పీరుబాషా, శ్రీను వాసులు రెడ్డి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: ప్రఖ్యాత భారతీయ ఆధ్యాత్మిక నాయకుడు రామకృష్ణ పరమ హంస ప్రియ శిష్యుడు, రామకృష్ణ మఠం వ్యవస్థాపకుడైన స్వామి వివేకానంద యువత కు నిరంతర స్ఫూర్తి ప్రదాత అని కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లిలో స్వామి వివేకానంద 160వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ వివేకానందుని స్ఫూర్తితో రాష్ట్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు యువత కోసం లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, రాజీవ్ యువకిరణాల ద్వారా 7 లక్షల మందికి ఉద్యోగవకాశాలు కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఏటా జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని వైకాపా తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని అధికారంలోకి వచ్చాక మాట తప్పిందన్నారు. పుండు మీద కారం చల్లినట్లు ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచి ముఖ్యమంత్రి నిరుద్యోగ యువతను నిరాశకు గురి చేసిందని ధ్వజమెత్తారు. అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ లో ఉన్న నారాయణ స్కూల్ నందు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ గీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏజీఎం చెన్నకేశవరాజు, ఆర్ఐ కిరణ్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం బోగి మంట వేసి,విద్యార్థులకు భోగి పండ్లు పోసి వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు సాంస్కృతి నృత్యాలతో, సంప్రదాయ వస్త్రధారణతో ఎంతగానో అలరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను మన దేశంలో చాలా వైభవంగా జరుపుకుంటారన్నారు. అనంతరం గాలిపటాలను ఎగరేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

విశాలాంధ్ర- కాశినాయన : మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలో సగిలేరు నది ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో స్వామి వివేకానంద 161 వ జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదట ఆశ్రమంలోని వివేకానందుని విగ్రహాలకు వివేకానంద ఫౌండేషన్ బృందము మరియు ఆశ్రమంలోని అవ్వతాతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మండల మండల పరిధిలోని వరికుంట్ల గ్రామ సమీపంలో గల గిరిజన కాలనీలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎస్సై ప్రవీణ్ కుమార్ హాజరై స్వామి వివేకానందునికి నివాళి అర్పించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, కుందారపు గురుమూర్తి, దాదన ప్రభాకర్ రెడ్డి, బొజ్జ ప్రసాదు, నాగవేణి, శ్రీలక్ష్మి, అపర్ణ, రేణుక పాల్గొన్నారు.

ప్రజలు పండుగలు జరుపుకోలేని స్థితిలో జగన్ పాలన: టీడీపీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా పండుగలు జరుపుకోలేని స్థితిలో ఉన్నారని టీడీపీ కడప నగర ఉపాధ్యక్షులు కొం డా సుబ్బయ్య, లింగాల శివశంకర్ రెడ్డి (న్యాయవాది) అన్నారు. గురువారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో వారు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాల పేరిట అధిక ధరలతో సామాన్యుడి నడ్డి విరిచేసారన్నారు. చంద్రబాబు హయాంలో చంద్రన్న క్రిస్మస్ కానుక,రంజాన్ తోఫా, సంక్రాంతి కానుక ఇచ్చేవారని పేద ప్రజలందరూ సంతోషంగా పండుగలు చేసుకొనే వారని గుర్తు చేశారు. జగన్ పాలనలో సామాన్యుడు తాగే పాలు, పెరుగు ధరలుతో పాటు పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగిపోయాయన్నారు. వ్యాపారాలు లేక ఆదాయాలు లేక, పనులు లేక ఖర్చులతో ప్రజల్లో సంతోషం లేక కట కటలాడుతున్నారన్నారు. ప్రజలు జగన్ పోవాలి బాబు రావాలని కోరుకుంటున్నారన్నారు. ఫించన్ కట్ చేసి, రేషన్ తగ్గించి, కానుకలు తొలగించి పన్నులు వడ్డించి ప్రజల నడ్డి మీద తంతున్న జగన్‌కు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి, సిటీ మైనార్టీ అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్ కడప వాణిజ్య విభాగం నెల్లూరు శ్రీధర్, మజ్జారి శ్రీనివాసులు, అబ్దుల్లా పాల్గొన్నారు.

పులివెందులలో పందుల స్వైర్య విహారం

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలో పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. ఇవి పట్టణంలో ఎక్కడిపడితే అక్కడ గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ఇటీవల కాలంలో వీటి సంఖ్య అధికమైంది. గతంలో ఇదే పరిస్థితి తలెత్తినపుడు ప్రజల ఫిర్యాదులకు అధికారులు స్పందించి పందుల యజమానులపై చర్యలు తీసుకున్నారు. దీంతో కొన్నాళ్ల పాటు పందులను పట్టణానికి దూరంగా తీసుకెళ్లారు. అయితే ఇప్పుడు మళ్లీ పందులు పట్టణంలో సంచరిస్తున్నాయి. పందుల వల్ల ముఖ్యంగా 12సంవత్సరాల వయసు లోపు వారికి మెదడువాపు వ్యాధి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధిని ప్రాణాంతక వ్యాధిగా వైద్యులు పరిగణిస్తారు. అధికారులు స్పందించి పందుల యజమానులతో మాట్లాడి వాటిఇ తిరిగి పట్టణానికి దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ యూత్ దినోత్సవాన్ని సమర్థ భారత్ పర్వ, చేరువేటి, స్టూడెంట్ ఆక్టివిటీ కౌన్సిల్, వివేకా నంద కేంద్రం కడప వారి సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డేని (స్వామి వివేకానంద) 160 వ జయంతిని కళాశాల సభా సమావేశం మందిరంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫౌండర్ పుల్లయ్య మాట్లాడుతూ భారతీయ వేదాంత తత్వాలను ఆశ్చర్య దేశాలకు, ప్రపంచానికి పరిచయం చేయడంలో స్వామి వివేకానంద కీలక భూమిక పోషించారన్నారు. అనంతరం ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బ్రాంచీలవారీగా ప్రశంసా పత్రాలను, నగదు రూ. 5000లను బహుమానం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్ రెడ్డి, డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రధానాచా ర్యులు డాక్టర్ విఎస్ఎస్ మూర్తి, బాలవికాస్ హై స్కూల్ (కడప) కరెస్పాండెంట్ గంగయ్య, కె.ధరణి కుమార్, కళాశాల స్టూడెంట్ యాక్టివిటీ సమన్వయకర్త లీనా రాస్తాపూర్, పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో వ్యవసాయ సెక్రటరీ రామారావు



విశాలాంధ్ర-వేంపల్లె: చక్రాయపేట మండలం గండిక్షేత్రం లో రాష్ట్ర వ్యవసాయ శాఖ సెక్రటరీ రామా రావు వీరాంజనేయ స్వామి వారిని గురువా రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన రామారావుకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి, చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ ఉన్నారు.

నేడు దొమ్మరనంద్యాలలో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర -మైలవరం : మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామంలో ఉన్న సచివాలయం -2 కొత్త మసీదు నుండి గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం ఉదయం జమ్మలమడుగు శాసనసభ్యులు డా. మూలే సుధీర్ రెడ్డి మరియు మండల అధ్యక్షురాలు చేరెడ్డి సావిత్రి, చేరెడ్డి చెన్నకేశవ రెడ్డిలు పాల్గొంటారనివైకాపా మండల కన్వీనర్ దన్నవాడ మహేశ్వర్ రెడ్డి గురువారం సాయంత్రం విలేఖరులకు తెలిపారు. ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే ఎమ్మెల్యే, ఎంపిపి దృష్టికి తెస్తే పరిష్కారం అవుతాయని అన్నారు. మండలంలోని వైకాపా నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ లో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ రిజిస్టర్ రాజేష్ కుమార్ రెడ్డి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డిప్యూటీ రిజిస్టర్ రాజేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ యువతకు స్వామి వివేకానంద ఒక ఆదర్శమూర్తిగా కీర్తి పొందారు. అతి చిన్న వయసులోనే వివేకానంద దేశ విదేశాల్లో యువజన సదస్సులో ప్రపంచ పేరు ప్రఖ్యాతలు సంపాదించి దేశ యువతకు ధైర్యం నూరి పోసి ప్రశ్నించే విధానం నేర్పిన స్వామి వివేకానంద అడుగుజాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు బుద్ధి చెప్పాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-బద్వేల్ : ఏఐటియుసి రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బద్వేల్ పట్టణంలో ఏఐటీయూసీ ఏరియా సమితి ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణము నందు రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద జీవో నెంబర్ ఒకటి పత్రాలను కార్మికులతో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు పివి రమణ జి ఎల్ నరసింహ లు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వానికి 2019 ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓట్లేసి గెలిపించిన ప్రజలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి కానుకగా ఈ చీకటి ఒకటో నెంబర్ జీవోను ఇవ్వడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. జగన్ అధికారంలోకి రావడానికి ముందు ఆయన ఓదార్పు యాత్రలు సభలు సమావేశాలు ధర్నాలు నిరసన కార్యక్రమాలు ఇలాంటివి మరెన్నో చేసి అధికారంలోకి వచ్చారనే మాట మరిచిపోయి ఇలాంటి జీవోలను అమలు చేయడం సిగ్గుచేటని వారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఈ నాగేష్ ఆటో యూనియన్ నాయకులు సంజీవ్ మినీ లారీ కార్మికులు రవీంద్ర కరిముల్లా భాష నాగేంద్ర కృష్ణమూర్తి కృష్ణ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టణం లో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధ ర్భం గా నల్లబోతుల నాగరాజు మాట్లాడుతూ రామకృష్ణ పరమ హంస ప్రియ శిష్యుడు స్వామి వివేకానంద అన్నారు. భారతదేశా న్ని జాగృతము చేయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులో యోగా వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసముల ద్వారా, వాదనల ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి వివేకానందది అన్నారు. అనంతరం నారాలోకేష్ పాదయాత్ర యువగళం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు పుత్తా ఎల్లారెడ్డి, యమ్మనూరు ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ఇదేం ఖర్మ కార్యక్రమం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలోని 9వ వార్డులోని శ్రీనివాసనగర్‌లో 5వ రోజు ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో టీడీపీ నియోజిక వర్గ ఇంచార్జ్ డా.జీవి ప్రవీణ్‌కుమా ర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాసనగర్‌లోని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సంధర్భంగా ఇంచార్జ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నియంత పాలన సాగిస్తున్నారని అన్నారు. ప్రజలపై అనేక పన్నుల భారం మోపుతున్నారని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో టీడీపీకి బ్రహ్మరథం పడుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్ రెడ్డి, 9వ వార్డుకు చెందిన కరీముల్లా, బూన్, షఫీ, శ్రీనివాసులు, రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు కసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి,, నల్లబోతుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ



విశాలాంధ్ర-ఒంటిమిట్ట : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, జూదం వంటి కార్యక్రమలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంటిమిట్ట ఎస్ఐ మధు సూదన్‌రావు హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ రోజున గుండాట, జూదం, కోడిపందేలు తదితర అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సంక్రాంతిని కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే మండలంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసు బృందాల ద్వారా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు. నిర్వాహకులు ఎవరైనా హోటల్‌లో, ఇంటిస్థలాల్లో కోడిపందేలు నిర్వహిస్తే డయల్ 100కు ఫోన్ చేస్తే చర్యలు తీసుకుంటామ న్నారు. ఈ అసాంఘీక కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుగానే గుర్తించి తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య, నారాయణ, మహిళా కానిస్టేబుల్ రాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

విశాలాంధ్ర-పీలేరు: యువజన సంఘాల సమైక్య ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 160వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొదటగా పీలేరు వివేకానంద సర్కిల్లోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి స్వామి వివేకనంద ఆశయాలను కొనహాయిస్తామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యువజన అవార్డు గ్రహీత రాయల బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ,ఈ దేశాన్ని ముందుకు తీసుకు పోవాలంటే అభివృద్ధి చెందాలంటే ఉన్నత ఆదర్శలతో చిత్తశుద్ధితో నిర్మాణాత్మకమైన వైఖరితో పనిచేసే యువతరం మాత్రమే ఈ దేశాన్ని మార్చగలవుసమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా న్యాయం, ధర్మం, కోసం యువత పోరాడాలని ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి రంగంలో పయనించాలని దీనికి అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు .ఈ కార్యక్రమంలో భానోదయ యువజన సంఘం, ఉషోదయ యువజన సంఘం, అరుణోదయ యువజన సంఘం, మరియు యువజన సంఘాల నాయకులు మద్దెల రమేష్, మల్లేపల్లి చంద్ర, బెల్లం పురుషోత్తం, పల్లం నాగరాజు, పులి చర్ల మహేష్, గుంతాటి మురళి ,రాధాకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోడి పందాలు, పేకాటకు అనుమతులు లేవు

విశాలాంధ్ర-చిట్వేలి : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు పేకాట కు ఎలాంటి అనుమతులు లేవని ఆలా ఏవైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని శిద్దారెడ్డిపల్లి నేతివారిపల్లి, నగిరిపాడు, వెంకటరాజు పల్లి తదితర గ్రామాలలో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడి వారికి అవగాహన కల్పించడం జరిగింది. కోడి పందాలు, పేకాట తదితర అసంఘటిత కార్యకలాపాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

విశాలాంధ్ర-చిట్వేలి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జాతీయ యువజన దినోత్సవం ఎన్సిసి అధికారి పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి మాట్లాడుతూ స్వామి వివేకానంద రామకృష్ణ పరమహంస శిష్యుడని వేదాంతములో సమాజంపై అత్యంత ప్రభావము కలిగించిన ఒక ప్రఖ్యాత ఆధ్యాత్మిక నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో పసుపుల రాజశేఖర్ , ఫిజికల్ డైరెక్టర్ డేవిడ్ ప్రసాద్ , కిరణ్ కుమార్ రాజు, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది జగదీష్, రిషిత, పాల్గొన్నారు.

కోర్టు తీర్పును శిరసా వహించాలి

విశాలాంధ్ర - రామసముద్రం : హైకోర్టు తీర్పు అనుసరించి మండల రెవెన్యూ అధికారులు మరియు పోలీసు సిబ్బంది గురువారం మండలంలోని కాప్పల్లి రెవెన్యూ పరిదిలోని ఈశ్వరప్ప మరియు శ్రీనివాసులు రెడ్డి లకు కొంత కాలంగా భూ సమస్యలపై కోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు తీర్పు ఆదేశాల మేరకు మండల రెవెన్యూ , పోలీసు సిబ్బంది వివాదాస్పద భూమి సర్వే హద్దులు చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగరాజ, ఆర్.ఐ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు నీటి ట్యాంకు ఏర్పాటు

విశాలాంధ్ర-సుండుపల్లె : సుండుపల్లి మండల పరిధిలోని పొలిమేరపల్లి పంచాయతీ వడ్ల తురకపల్లిలో తాగునీటి బోరుతో పాటు 2000 లీటర్ల నీటి ట్యాంకును ఏర్పాటు చేసినట్లు ఆ గ్రామ సర్పంచ్ భర్త వైకాపా నాయకుడు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. గ్రామస్తులు తమ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యేకి విన్నవించగా రాజంపేట ఎమ్మెల్యే మేడ మల్లికార్జు న్ రెడ్డి ఆదేశాల మేరకు నూతన బోరు వేయించి ట్యాంకు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. వేసవిలో తాగునీటి సమస్య ఉందని ముందు జాగ్రత్తగానే నీటి సౌకర్యం కల్పించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

14 నుండి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

విశాలాంధ్ర-సుండుపల్లె : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని కేఎం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ (షటిల్) టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హరికుమార్ తెలిపారు. 14వ తేదీన రాయచోటి జోన్ స్థాయిలో షటిల్ టోర్నమెంట్స్ నిర్వహిస్తారని కావున 13వ తేదీ సాయంత్రం లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మొదటి బహుమతి 8000, రెండవ బహుమతి 5000, మూడవ బహుమతి 3000, నాలుగవ బహుమతి 2000 ఉంటుందని నిర్వాహకులు హరి కుమార్, విజయకుమార్, సయ్యద్ అబ్దుల్ హమీద్ తెలిపారు.వివరాలకు 8247830940 సంప్రదించాలన్నారు.

రమణారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే చింతల

విశాలాంధ్ర-గుర్రంకొండ: వైఎస్ఆర్సిపి ఎల్లుట్ల రమణారెడ్డి ద్విచక్ర వాహనంలో పడి గాయాలు కావడంతో గత నెల నుంచి ఇంటి కే పరిమితం అయ్యారు విషయం తెలుసుకున్న శాసనసభ్యులు చింతల రామచంద్రా రెడ్డి గురువారం ఎల్లుట్ల గ్రామం లోని రమణారెడ్డి ఇంటికి వెళ్లి వారి యోగ క్షేమాలు విచారించారు తన సహాయం ఎల్లవేళలా ఉంటుందని ధైర్యం చెప్పారు వారి వెంట వైఎస్ఆర్సిపి మండల ప్రత్యేక ఆహ్వానితుడు సోమేపల్లి యోగేంద్ర ఎంపీటీసీ రాజగోపాల్ సింగల్ విండ్ అధ్యక్షుడు వెంకట శివారెడ్డి, రెడ్డి కుమార్, మరి మాకులపల్లి సర్పంచ్ మస్తాన్ రెడ్డి పాల్గొన్నారు.

వివేకానంద ఆశయాలు యువతకు మార్గదర్శకం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: భారతదేశ ఆధ్యాత్మిక వేత్త, స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద ఆశయాలు లక్ష్యసాధనకు కృషి చేసి దేశ ప్రగతిలో నేటి యువకులు భాగస్వాము లు కావాలని కిసాన్ మోర్చా హార్టికల్చర్ స్టేట్ కన్వీనర్ తోట శ్రీనివాసులు పిలుపునిచ్చారు.గురువారం స్వామి వివేకానంద 160 జయంతి సందర్భంగా బిజెపి పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయప్రకాష్ నారాయణ వర్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊటుకూరు చలపతి, ఓబీసీ మోర్చా మాజీ స్టేట్ కార్యవర్గ సభ్యులు బత్తల సుబ్రహ్మణ్యం, స్టేట్ కౌన్సిల్ నెంబరు శంకర్ రాజు, జిల్లా మహిళా కార్యదర్శి బత్తల సరస్వతి, మండల కన్వీనర్ సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, సుబ్బరత్నమ్మ, యామిని తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

200 రోజులు పనిదినాలు కల్పించాలి

విశాలాంధ్ర-చిట్వేలి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చిట్వేల్ మండలం ఏపీవో చంద్రకళకు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికేయంయు ఆధ్వర్యంలో గురువారం మెమరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక జిల్లా సహాయ కార్యదర్శి కేశం ప్రసాద్, సిపిఐ సహాయ కార్యదర్శి సామా గంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త, కొత్త నిబంధనల పేరుతో ఉపాధి హామీ కూలీలను కలవరపెడుతుందని, పని చేసే ప్రదేశాలలో మాస్టర్ కాకుండా జాతీయ మొబైల్ మానటరింగ్ సిస్టమును అమలు చేయడంను వ్యతిరేకిస్తున్నామన్నారు. కూలీలకు సంవత్సరంలో 200 రోజులు పని కల్పించి, ఒక్క రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని పనిచేస్తూ ప్రమాదవశాత్తు ఏదైనా జరిగి మరణిస్తే ఆ కుటుంబానికి పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఎండాకాలం పనిచేసే ప్రదేశాలలో షెల్టర్లు, మెడికల్ కిట్లు, మజ్జిగ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్ నరసింహులు, చిన్న నరసయ్య పాల్గొన్నారు.

బట్టలు పంపిణీ

విశాలాంధ్ర-సుండుపల్లె : మండలంలో యర్రపురెడ్డి రవీంద్రారెడ్డి అభిమానులకు సంక్రాంతి కానుకగా బట్టలతో పాటు ఆర్థిక సాయం ఆయన సతిమణి జయమ్మ అందజేశారు. మండలంలోని నలుమూలల ఉన్న కార్యకర్తలకు అభిమానులకు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నగొల్లపల్లె సర్పంచ్ రామా జయచంద్ర చేతుల మీదుగా నిరుపేదలకు బట్టలు పంపిణీ చేశారు సర్పంచ్ మాట్లాడుతూ యర్రపురెడ్డి జయమ్మ పిలుపు మేరకు నిరుపేదలకు బట్టలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని, పేదలకు అండగా ఉంటూ ప్రజాసేవలో ముందుండే అజయ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మండల ప్రజల కోసం పరితపించే నాయకుడు అజయ్ రెడ్డి అని ప్రశంసించారు.

నిరంకుశ జిఒను రద్దు చేయాల్సిందే

విశాలాంధ్ర- మదనపల్లి: జీవో నెంబర్ 1 ప్రజాఉద్యమాలకు, ప్రజానీకం మొత్తానికి నష్టం కలిగిస్తుందని ,ప్రజా, కార్మిక శ్రేయస్సు దృష్ట్యా జీవో నెంబర్ 1ని పూర్తిగా రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ,ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి దేవ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం మదనపల్లి టమోటా మార్కెట్ యార్డు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూరాష్ట్రంలో ప్రజా సమస్యలను, కార్మిక వర్గ సమస్యలను వదిలేసి ఎన్నికల సందర్భంగారోడ్లపై సభలు, సమావేశాలను నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిరంకుశ జిఒ-1ని పూర్తిగా రద్దు చేయాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రెడ్డప్ప, సంతోష్,సాయి, వెంకటేష్,రవి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: కర్నూలు చిత్తూరు జాతీయ రహదారి గుట్టపల్లి గ్రామం బావులకాడపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి .పోలీసుల వివరాల మేరకు శెట్టిపల్లి గ్రామం ఎర్ర మొరంపల్లె కు చెందిన సాయికుమార్ ద్విచక్ర వాహనంలో కలకడకు వెళుతుండగా కడపకు చెందిన లక్ష్మీదేవి ఎరుకులమ్మ పాలెం గడ్డ హరిజనవాడ బంధువుల ఇంటికి వచ్చి మహల్ దగ్గర కొర్ల మిట్టపల్లెకు ఆటోలో వెళుతుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న జీపు బావులకాడ పల్లె క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ద్విచక్ర వాహనాన్ని ఢీకొని తప్పించబోయి ఆటోకు ఢీకొనడంతో సాయికుమార్,లక్ష్మీదేవి ఎరుకలమ్మకు గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన వీరిని కలకడ 108 సిబ్బంది వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ఎండి షరీఫ్ తెలిపారు.

యువత క్రీడలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-నందలూరు: క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ మాజీ సభ్యులు యల్లటూరు శివరామరాజు అన్నారు. గురువారం స్థానిక క్రీడా మైదానంలో ప్రముఖ విద్యావేత్త, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చమర్తి జగన్ మోహన్ రాజు సహాయ సహకారంతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ లో ఆయన పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ స్టేట్ సెక్రటరీ సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్లో ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని అన్నారు. అంతేకాకుండా యువతలో సానుకూల దృక్పథం పెరుగుతుంది. కావున ప్రతి ఒక్కరూ అవకాశం వచ్చినప్పుడు క్రీడల ద్వారా తమ సత్తా చాటాలని వారు తెలిపారు. ఈరోజు జరిగిన పోటీల్లో హర్షద్ లెవన్స్ విజయం సాధించగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ తో పాటు క్రీడాకారులకు మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సమ్మెట ఉమామహేష్, తోట శివశంకర్, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, మాడపూరి శ్రీరాములు, తెలుగుదేశం పార్టీ నాయకులు కుర్రామని, కొండిశెట్టి సుదర్శన్, లయన్స్ క్లబ్ సభ్యుడు గురు ప్రసాద్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక ముగ్గుల పోటీలు : సిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: ముగ్గుల పోటీలు సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతీక అని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ముందస్తు సంక్రాంతి సంబరాలలో భాగంగా గురువారం కె.బుడుగుంటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సమతానగర్ లో ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యురాలు చెన్నూరు కృష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల కార్యక్రమంలో సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో భాగంగా ముగ్గుల పోటీలు కూడ ఒక భాగమే అన్నారు.మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఉత్సాహంగా జరిగిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి సిఐ ఎస్ విశ్వనాథరెడ్డి, కె.బుడుగుంటపల్లి గ్రామపంచాయితీ సర్పంచ్ దార్ల చంద్రశేఖర్,ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యురాలు చెన్నూరు కృష్ణవేణి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య సభ్యులు ఆర్ రమాదేవి, జి లక్ష్మీదేవి, చిట్వేలి మండల సమాఖ్య సభ్యులు జ్యోతి సుస్మిత పాల్గొన్నారు.

సబ్ జైల్లో సుహేల్ ను పరామర్శించిన నల్లారి కిషోర్

విశాలాంధ్ర మదనపల్లి : మదనపల్లి సబ్ జైలు వద్ద పుంగనూరుకు చెందిన మైనారిటీ నేత సోహెల్ ను పరామర్శించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పుంగనూరు ప్రజలు ధైర్యంగా ఉండాలని రాబోయే రోజుల్లో తమవేనని తెలిపారు ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, చల్లా బాబు మదనపల్లి నియోజకవర్గం టీడీపీ నాయకులు జయరామ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి పర్వీన్ తాజ్,మాజీ సర్పంచ్ పటాన్ ఖాదర్ ఖాన్ పాడు స్వామి, రమణ, మహేశ్వరెడ్డి పాల్గొన్నారు.

యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర-రామాపురం : యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంఎల్ఏ మోహన్ రెడ్డిలు అన్నారు. గురువారం రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల మధ్య ఉన్న దూదేదుకుల పల్లెలో జరుగుచున్న క్రికెట్ టోర్నమెంట్ ను శ్రీకాంత్ రెడ్డి, మోహన్ రెడ్డి లు సందర్శించారు. శ్రీకాంత్ రెడ్డి, మోహన్ రెడ్డిలకు గ్రామస్తులు, యువకులు ఘనంగా స్వాగతం పలికారు. క్రికెట్ పోటీల సందర్భంగా కేక్ కట్ చేశారు. కొద్దిసేపు శ్రీకాంత్ రెడ్డి క్రికెట్ ఆడి క్రీడాకారులును, యువకులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాధ రెడ్డి, మాజీ ఎంపిపి అంపాబత్తిన రెడ్డెయ్య, దిన్నెపాటి గజేంద్రా రెడ్డి,హస్త కళల డైరెక్టర్ హుసేనయ్య, సర్పంచ్ వలీ, ఉప సర్పంచ్ రఫీ, వైఎస్ఆర్ సిపి నాయకులు చిన్నబాష, రామాపురం సర్పంచ్ అయోధ్యాపురం నాగభూషన్ రెడ్డి, కమాల్, ఖాదర్ బాష, మధు, అబ్దుల్లా, సుభాన్, కాలేష, రియాజ్, సాయి పాల్గొన్నారు.

యువత వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతిభా జూనియర్ కాలేజీలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆపస్ జిల్లా అధ్యక్షులు కె.రమణారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి ముఖ్యంగా నేటి యువతకు స్వామి వివేకానంద ప్రసంగాలు, బోధనలు మార్గనిర్దేశం చేస్తాయని అన్నారు. 1893 సెప్టెంబర్ 11న చికాగోలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనంలో పాల్గొని భారతదేశం కీర్తిని ప్రపంచవ్యాప్తం చేశారని అన్నారు. రాష్ట్ర సహాధ్యక్షులు రామమోహన్ రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తి ప్రదాత అని, వారి జీవితం విద్యార్థులకు ఆదర్శప్రాయమని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ ఆపస్ సంఘం స్వామి వివేకానంద జయంతిని కర్తవ్య బోధ్ దివస్‌గా జరుపుకొంటుంది అని, స్వామి వివేకానంద గారి ఆదర్శాలను అందరూ పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుమతి, ఉపాధ్యక్షులు క్రిష్ణవేణి, రవీంద్రరెడ్డి, కార్యవర్గ సభ్యులు మల్లయ్య, రాజేంద్ర ప్రసాద్, మధుసూదన్, సదాశివుడు, వెంకటరమణ, వాణిశ్రీ, రామతులసమ్మ, సంఘ కార్యకర్తలు, పాల్గొన్నారు.

హిందూ వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: హిందూ వ్యతిరేక విధానాలను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించుతామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతు గుంట రమేష్ నాయుడు పేర్కొన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టర్ కార్యాలయం వద్ద బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతు గుంట రమేష్ నాయుడు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ ఆలయాలపై, హిందూ రథాల పైన విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నప్పటికి చర్యలు తీసుకున్న సందర్భాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చీరల శ్రీనివాస్ యాదవ్,బిజెపి రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు, బిజెపి పొలిటికల్ ఫీడ్బ్యాక్ కమిటీ మెంబర్ సాయి లోకేష్, బిజెపి నాయకులు గోపాల్ రెడ్డి శివప్రసాద్, సుభద్ర,రేపన శివప్రసాద్, పురుషోత్తం, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, రాజశేఖర్ రెడ్డి, గాదెల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర -రాజంపేట : పట్టణ కేంద్రంలోని నూనెవారిపల్లి రోడ్డులో ఉన్నటువంటి షిరిడి సాయి రెయిన్ బో స్కూల్లో గురువారం కరస్పాండెంట్ గురజాల రెడ్డయ్య ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గురజాల రెడ్డయ్య మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మీయ పండుగ సంక్రాంతి అన్నారు. ఈ పండుగను ప్రజలు అత్యంత వేడుకగా జరుపుకుంటారు అన్నారు. ఈ ముందస్తు వేడుకల్లో భాగంగా ముగ్గులు పోటీలు నిర్వహించారు. సాంప్రదాయ పండుగల సంస్కృతిని ఎల్లప్పుడు కాపాడుకోవాలన్నారు.

పాత్రికేయుల కృషి ప్రశంసనీయం

విశాలాంధ్ర - రాజంపేట: విశాలాంధ్ర దిన పత్రిక అభివృద్ధికి అన్నమయ్య జిల్లా విశాలాంధ్ర పాత్రికేయుల కృషి ప్రశంసనీయమని ఉమ్మడి జిల్లాల బ్యూరో పల్లేటి రామసుబ్బారెడ్డి, తిరుపతి ఎడిషన్ మేనేజర్ సుబ్బరాయుడు అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి ఎన్జీవో కార్యాలయంలో విశాలాంధ్ర పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో విశాలాంధ్రలో పనిచేస్తున్న పాత్రికేయులు వివిధ రంగాలలో ప్రకటనలు సేకరించి సంస్థను ప్రగతి పథంలో నడిపించేం దుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే 2023 క్యాలెండర్ ప్రకటన సేకరణలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన రాజంపేట విశాలాంధ్ర పాత్రికేయులు భాస్కర్, మదనపల్లి శ్రీనివాసులు గౌడ్, లక్కిరెడ్డిపల్లి వెంకట భాస్కర్‌లను, వీరితో పాటు మరి కొంతమందిని శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌లో నేషనల్ యూత్ డే

విశాలాంధ్ర -మదనపల్లి: మదనపల్లి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాల నందు మిట్స్ ఎన్. ఎస్. ఎస్ విభాగము వారు నేషనల్ యూత్ డే ను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమము లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము జనవరి 12 న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జరుపుకునే 'జాతీయ యువజన దినోత్సవం' యువతులకు స్ఫూర్తినివ్వాలి అని, యువతకు మార్గం చూపాలి అని ఆయన అన్నారు. ప్రస్తుతము యువత ఎన్నో రంగాలలో రాణిస్తున్నారు అని ఆయన అన్నారు. ముఖ్యంగా మహిళలు అనేక రంగాలలో రాణిస్తున్నారని ఆయన అన్నారు. ఇవాళ టెక్నికల్ విద్యలో, మెడిసిన్‌లో అమ్మాయిలు రాణిస్తున్నారు అని, ఎంచుకుని మరీ ర్యాంకులు సాధిస్తున్నారు అన్నారు, మరోవైపు మేనేజ్‌మెంట్ రంగాల్లో, సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో ఎంతో మంది యువతులు రాణిస్తున్నారు అని ఆయన అన్నారు. కళారంగాలను ఎంచుకుంటున్నారు. సినిమా రంగ దర్శకత్వ శాఖలో గతంలో యువతులు కనిపించేవారు కాదు అని, ఇవాళ చాలామంది పని చేస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల యెన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : మేడా

విశాలాంధ్ర - రాజంపేట : పట్టణాభివృద్ధికి కౌన్సిలర్లతో పాటు పురపాలక శాఖ అధికారులు సైతం ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లిఖార్జున రెడ్డి తెలియజేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మేడా కౌన్సిలర్లు, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత శీతాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి మరియు కౌన్సిల్లర్లతో పురపాలక పరిధిలోని పలు సమస్యల పైన చర్చించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి కావలసిన చర్యలు చేపట్టడం జరుగుతోందని, పట్టణాభివృద్ధే తమ ధ్యేయమని తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించాలి- మేడా:

సంక్రాంతి పండుగ తెలుగు వారికి ఎంతో ప్రతిష్టాత్మకమైనదని, శుక్రవారం ఇన్ఫాంట్ జీసస్ హై స్కూల్ లో నిర్వహించబోయే సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించాలని శాసనసభ్యులు మేడా మల్లికార్జున రెడ్డి అధికారులను ఆదేశించారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా ఇన్ఫాంట్ జీసస్ హై స్కూల్లో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలను నిష్పక్షపాతంగా జరిపించాలని అన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరు ఈ పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కౌన్సిలర్లు, అధికారులతో కలిసి సంక్రాంతి సంబరాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

సచివాలయాలను అకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో

విశాలాంధ్ర-రామాపురం : మండలంలోని రామాపురం పరిధిలో ఉన్న కుమ్మరపల్లి. చిట్లురు. హసనాపురం. సరస్వతిపల్లి. నల్లగుట్టపల్లి కొత్తపల్లి గ్రామాల్లోని సచివాలయం గురువారం ఎంపీడీవో హైదర్ వల్లి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి వారికి సమాధానాలు ఇవ్వాలన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు సహకరించని సిబ్బందిపై కూడా చర్య తీసుకుంటామన్నారు. సచివాలయంలో ప్రతిరోజు సాయంత్రం సమయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మద్దిలేటి రెడ్డి కమలమ్మ. పీరయ్య విమల కుమారి .హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రిష్ణయ్యను పరామర్శించిన నల్లారి

విశాలాంధ్ర-పీలేరు:పీలేరు తెలుగుదేశం పార్టీ టీడీపీ నాయకులు క్రిష్ణయ్య కొద్దిరోజులుగా పెరాలసిస్ తో ఆసుపత్రిలో చికిత్స పొందారు.సమాచారం తెలుసుకున్న టీడీపీ జాతీయనేత నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి క్రిష్ణయ్య స్వగ్రాహం సైనిక్ నగర్ లో ఆయనని కలుసు కొని యోగ క్షేమాలు తెలుసుకొని ఆయనకు మరియు వారి కుటుంబ సభ్యులకు పరా మర్శించారు.

ఘోర రోడ్డు ప్రమాదం - ముగ్గురు మృతి

విశాలాంధ్ర-జమ్మలమడుగు : జమ్మలమడుగు పరిసర ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. వివరాల్లోకెళితే జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లే మార్గమధ్యలో గల దానవులపాడు గ్రామ పొలంలో వరినాట్లు నాటడానికి పనికి వెళ్లారు. వారిలో కొందరు ఉదయం అల్పాహారం తినేందుకు 9గంటల ప్రాంతంలో రోడ్డు పక్కన గల పొలం గట్టుపై కూర్చున్నారు. ఇంతలో జమ్మలమడుగు వైపు నుంచి ఒక ట్రిప్పర్ వారి మీద నుంచి వేగంగా వెళ్లడంతో ధర్మాపురం గ్రామానికి చెందిన నాగసుబ్బారెడ్డి, గొరిగెనూరు గ్రామానికి చెందిన ఓబులేసు శరీరాలు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందారు. టిప్పర్ కూడా అదుపుతప్పి చాలా దూరంలో పొలంలో వెళ్లి బోల్తాపడడంతో టిప్పర్ డ్రైవర్ విజయ్‌కుమార్ కూడా మృతి చెందాడు.

మృతుల బంధువులను పరామర్శించిన నాయకులు

ఘోర రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే డా.మూలె సుధీర్‌రెడ్డి మృతుల బంధువులను సంఘటనా స్థలానికి వెళ్లి పరామర్శించారు. బాధిత కుటుంబాలైన నాగసుబ్బారెడ్డి, తలారి ఓబులేసు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం చేశారు. అలాగే జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేష్‌రెడ్డి సంఘటనా స్థలంలో బాధిత కుటుంబాలను పరామర్శించారు.

రోడ్డుపై బైఠాయించిన బాధిత కుటుంబ సభ్యులు

ప్రమాద స్థలంలో బాధిత కుటుంబ సభ్యులు సరైన న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించారు. జమ్మలమడుగు నుండి ప్రొద్దుటూరుకు వెళ్లే రాకపోకలు దాదాపు గంటసేపు అంతరాయం ఏర్పడింది. నాయకులు, పోలీసులు సరైన న్యాయం చేస్తామని చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం సంఘటన స్థలంలో జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, సీఐ సదాశివయ్య, పోలీసు సిబ్బంది భద్రత ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూశారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని సిటీఎం నుంచి తిరుమల కు పాదయాత్ర

విశాలాంధ్ర -మదనపల్లి: గత 25 సంవత్సరాలుగా చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండాలంటూ సిటీఎం నుండి తిరుమల కు పాదయాత్ర నిర్వహిస్తున్న పోతబోలు నాగరాజు, నేడు చంద్రబాబు మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ తిరుమలకు పాదయాత్రను ప్రారంభించారు. సిటీఎం ఆంజనేయస్వామి గుడి వద్ద జరిగిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ఆనవాయితీగా పాదయాత్ర చేస్తున్న నాగరాజు ఆశయాలు నెరవేరాలని, చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని, దారి తప్పిన రాష్ట్ర ప్రగతిని గాడిలో పెట్టి అమరావతి, పోలవరం నిర్మాణాలను పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుత్తికొండ త్యాగరాజ. పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రమణ, మహేశ్వర్ రెడ్డి, ముని రెడ్డి, మురళి, రమేష్ యాదవ్, పెద్ద సంఖ్యలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.. అవగాహన సదస్సులో డిఎస్పి కేసప్ప..

విశాలాంధ్ర -మదనపల్లి : ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని మదనపల్లి డి.ఎస్.పి కేసప్ప తెలిపారు. మదనపల్లి జేసియం కమ్యూనిటీ భవనంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఎస్పి మాట్లాడుతూ.. మదనపల్లిలో ట్రాఫిక్ నియంత్రణకు ఆటో డ్రైవర్లు సహకరించాలన్నారు. రికార్డులు క్రమబద్ధీకరణలో భాగంగా ప్రతి ఒక్కరూ కంప్యూటరైజేషన్ చేయించాలన్నారు. ఆటోపై పోలీసు నెంబరు కలిగి ఉండాలని. ఓవర్ లోడ్ లో వెళ్లడం వల్ల రోడ్డు ప్రమాదాలు నిబంధనలోమదనపల్లిలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరణ కోసం అతి త్వరలో షేర్ ఆటోలకు కూడా పార్కింగ్ స్థలాలు ఎంపిక చేస్తామని.ప్రతి ఒక్క ఆటో స్టాండ్ కూడా ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండాలని.ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని.ప్రతి ఒక్క ఆటో డ్రైవరు తప్పనిసరిగా యూనిఫామ్ , ఐడి కార్డు ధరించాలని.మదనపల్లి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు, నేరాల నియంత్రణకు కూడా తమ వంతు సహకారం అందించాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో సుమారు 300 ఆటో డ్రైవర్లు మరియు మదనపల్లి తాలూకా సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, మదనపల్లి టూ టౌన్ ఎస్సై జి చంద్రమోహన్, వన్ టౌన్ ఎస్ఐ హరిహర ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌సీఎన్‌జీ స్టేషన్ కడపలో ఏర్పాటు అభినందనీయం

డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ బాషా, ఎం పీ వైయస్ అవినాష్ రెడ్డి

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్: రాష్ట్రంలో మొట్టమొదటి లిక్విఫైడ్, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (ఎల్‌సీఎన్‌జీ) స్టేషన్ ను ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ కడపలో ఏర్పాటు చేయడం అభినందనీయం అని డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాషా, కడప ఎం పి వైయస్ అవినాష్ రెడ్డి లు తెలిపారు. కడప నగర శివారులోని పుట్లం పల్లె పరిధిలో నూతన లిక్విఫైడ్ అండ్ కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (ఎల్‌సీఎన్‌జీ) స్టేషన్‌ను గురువారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, కడప పార్లమెంటరీ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి లు ఏజీ అండ్ పీ ప్రథమ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అఖిలేష్ గుప్తా లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంప్రదాయం ఇంధన వనరుల లాంటి పెట్రోల్ డీజల్‌తో పోలిస్తే సి.ఎన్.జి. లో అధిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పర్యావరణ హితమైన వాతావరణాన్ని సృష్టించడం జరుగుతుందన్నారు. అలాగే వాహనాలు, పరిశ్రమలు విడుదల చేసే గాలి కాలుష్య కారకాలైన విషపూరిత రసాయనాలను అరికట్టడం సాధ్యమవుతుందని, అంతేకాకుండా దేశానికి అవసరమైన ఇంధన నిల్వలను సమృద్ధి చేసుకోగలమని తద్వారా దేశ ఆర్థిక ప్రగతి పురోగమనం వైపు నడిచేందుకు తోడ్పడుతుందనీ వారు తెలిపారు. ఏజీ అండ్ పీ ప్రథమ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అఖిలేష్ గుప్తా మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి ఎల్‌సీఎన్‌జీ స్టేషన్ ప్రారంభించడం ద్వారా రాష్ట్రం అత్యంత సహజసిద్ధమైన వాయువును ప్రత్యామ్నాయ ఇంధనంగా గృహాలు, పరిశ్రమలు, వాణిజ్య, రవాణా అవసరాలకు ఇంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ ప్లాంటు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికారులు అందిస్తున్న నిరంతర సహకారంకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీ అండ్ పీ ప్రథమ్ సీనియర్ మేనేజ్‌మెంట్ చరదీప్ దత్తా,వెంకటేష్, ఉద్యోగులు, మహేష్,వైసిపి నాయకులు అఫ్జల్ ఖాన్, పులి సునీల్ కుమార్, సుబ్బారెడ్డి, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చట్ట సవరణ బిల్లు ను ఉప సంహరించుకోవాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జి.ఈశ్వరయ్య డిమాండు

విశాలాంధ్ర- కడప రూరల్ : విద్యుత్ చట్ట సవరణ బిల్లు పార్లమెంట్ శీతాకాల సమావేశల్లో ప్రవేశ పెడితే విపక్షా పార్టీలు వద్దే వద్దని నిరసన చేస్తుంటే బిల్లును స్టాండింగ్ కమిటీకి ఎలా పంపిస్తారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బిల్లుతో సంబంధం లేకుండా అందులో ఉన్న అంశాలనే దాదాపు అమలు తెస్తూ నోటిఫికేషన్లు విడుదల చేయడం అత్యంత దుర్మార్గం అని నియంతృత్వ పాలన అని ఆయన అన్నారు. విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 176 ను అడ్డుపెట్టుకొని బరితెగిస్తున్న కేంద్ర ప్రభుత్వనికి పార్లమెంట్ అంటే లెక్కలేదు కోర్టులను ఖాతారు చేయరు విపక్షల మాటకు విలువ ఇవ్వరని మండిపడ్డారు. అసెంబ్లీ తీర్మానానికి కూడా ప్రాధాన్యత లేదని గుజ్జల ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను ఏమి అనుకుంటే అది చేసి తీరుతానని నా మాటే శాసనం అని ఆదానీ అంబానీలకు ఊడిగం చేసే పాలేరులా మోదీ తీరు ఉందన్నారు..విద్యుత్ చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ వచ్చిన బిల్లును పార్లమెంటు స్థాయి సంఘనికి పంపి బిల్లు ఇంకా స్టాండింగ్ కమిటీ పరిశీలనలో ఉండగానే మోదీ సర్కారు అంతలోనే కరెంటుపై దొంగ దెబ్బ తీసిందని ఎద్దేవా చేశారు. కేంద్రం రూపొందించిన విద్యుత్ సవరణ బిల్లు 2002లో అనేక అంశాలపై దేశవ్యాప్తంగా దుమారం రేగింది. విద్యుత్ సంస్థలను విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి సవరణ బిల్లు ప్రభుత్వం తీసుకువచ్చినట్టు దేశ వ్యాప్తంగా విపక్షాలు ప్రజలు దుమ్మెత్తి పోశారు. ఈ బిల్లును బిజెపి మినహా అన్ని పక్షాలు వ్యతిరేకించాయి. లోక్ సభ రాజ్యసభలో తీవ్ర విమర్శలను కేంద్రం ఎదుర్కొన్నది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యుత్ అంశంపై రాష్ట్రాలతో చర్చించకుండానె బిల్లును రూపొందిస్తారా అని సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోందని ఈశ్వరయ్య అన్నారు. మోదీ సర్కారు కార్పొరేట్లకు విద్యుత్ రంగాన్ని కట్ట పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నదని అన్నారు.ఏ దారి అయితే ఏంది మనం అనుకున్నది చేయాలి మనల్ని నమ్ముకున్న కార్పొరేట్లు ఆదాని అంబానీలకు విద్యుత్ రంగాన్ని కట్టబెట్టాలనీ అని మోడీ చూస్తున్నరని మండిపడ్డారు. విద్యుత్ వినియోగదారుల మొదలుకొని విద్యుత్ ఉత్పత్తి డిస్కం లు రెన్యువబుల్ ఎనర్జీ బకాయిలు వసూలు ఇలా ప్రతి అంశము కార్పొరేట్ శక్తుల చెప్పు చేతుల్లోకి రావాల్సిందే సబ్సిడీకి చెందినవి మాత్రమే ప్రభుత్వంలో ఉంటాయి. నోటిఫికేషన్లు నిబంధనల పేరుతో స్టాండింగ్ కమిటీ పరిశీలనలో ఉన్న సవరణ బిల్లు 2022లోని అమల్లోకి తేవడం కేంద్ర ప్రభుత్వం దాష్టికానికి పరాకాష్ట రెన్యువబుల్ పవర్ పర్చేజ్ అప్లికేషన్ ప్రతి రాష్ట్రానికి రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి సంబంధించి. భౌగోళికంగాకొన్ని పరిమితులుఉన్నాయి. కానీ ఇవేమీ దృష్టిలో పెట్టుకోకుండా నోటిఫికేషన్ లు ఇవ్వడం ద్వారా కేంద్రం ప్రతి రాష్ట్రం నిర్దేశిత మొత్తంలో రెన్యువల్ విద్యుత్తును కొనుగోలు చేయకపోతే ఒక యూనిట్ ధర రూ 0.25 పైసల నుంచి రూ0. 50 పైసలు పెనాల్టీ విధిస్తారని అన్నారు దీనివల్ల ఆయా రాష్ట్రాల్లోని ధర్మల్ విద్యుత్ కేంద్రాల సామర్థ్యాన్ని తగ్గించుకోవాల్సిన ఆగత్యంవుంది దీనివల్ల ఫిక్సడు కాస్ట్‌ల రూపంలో విద్యుత్ ధర పెరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన విద్యుత్తును ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులు అదాని అంబానిలకు ఇవ్వడమే మోడీ లక్ష్యమని అన్నారు.ఒకే ప్రాంతంలో వేరు వేరు సెల్ ఫోన్ కంపెనీలు ఫోన్ కనెక్షన్లు ఇచ్చినట్లుగా ఇక మీదట రెండు కనెక్షన్ల సైతం అనేక కంపెనీలు ఇచ్చేందుకు అవకాశం ఉంది అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అనేది భవిష్యత్తు ఇక ఉండదని వ్యవసాయ మోటార్ల కు మీటర్లు బిగించే ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకాకుళం నుంచి పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకొన్నదని ఇది రాష్ట్ర మంతా మోటార్లకు మీటర్లు బిగించాలని మోడీ అదాని ఒత్తిడని తీస్తున్నారని అన్నారు. ప్రభుత్వ డిస్కంల వ్యాపార పరిధి తగ్గిపోయి భవిష్యత్తులో కరెంటు వ్యాపారమంతా ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్ళుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా, పంపిణి, ఉత్పత్తి రంగాలను ప్రైవేట్ పరం అవుతాయని పంపిణి రంగంలో అదాని అంబానీలు లైసెన్స్‌లు పొంది విద్యుత్ వ్యాపారం చేసుకొనుటకు కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ భారతదేశంలో వున్నా 150కోట్ల మంది ప్రజల సంపదని విద్యుత్ రంగాన్ని కాపాడుకోవడం కోసం రైతుల తరహా ఉద్యమం చేయాలనీ గుజ్జల ఈశ్వరయ్య ప్రజలకు పిలుపునిచ్చారు.

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకం

విశాలాంధ్ర-రామాపురం : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి,అరాచక,నియంతృత్వ,అక్రమ పాలనను సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని త్వరలోనే గద్దె దింపుదాం అని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి రమేష్ కుమార్ రెడ్డి అన్నారు.

మండలంలోని చిట్లూరు పంచాయతీలోని పాలన్న గారిపల్లి. పక్కీరుపల్లి గ్రామాలలో గురువారం, బుధవారం ముస్లిం మైనార్టీ సోదరుల ఆధ్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వైసిపి ప్రభుత్వం కొనసాగిస్తున్న అరాచకాల గురించి ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గత టిడిపి హయాంలో ముస్లిం మైనార్టీలకు అందేటటువంటి దుల్హన్ పథకం,రంజాన్ తోఫా,మసీదుల్లో పనిచేస్తే మౌజమ్ లకు జీతాలు ఇవ్వడం తదితర పథకాలను లేకుండా చేశారని ఆరోపించారు.ఈ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.మహిళల పరిస్థితి అయితే మరింత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతినిత్యం సామాన్యుల జీవింతాలతో చెలగాట మాడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచేందుకు ప్రజలంతా సైనికుల్లా ముందుకు కదలాలని ఆయన ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాఅధ్యక్షులు దివ్య కుమార్ రెడ్డి . టిడిపి నాయకులు భవనం వెంకటరామిరెడ్డి. నరేంద్ర కుమార్ రెడ్డి రామక్రిష్ణ గౌడ్ నందలూరు, వెంకట్రామిరెడ్డీ తదితరులు పాల్గొన్నారు.

ఎ2జడ్ మొబైల్ షాపు ప్రారంభించిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-సుండుపల్లె : రాయవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు "ముక్క" యస్. అల్లా బకాష్ కుమారులు యస్. అబ్దుల్లా, యస్.అస్లాం టి. సుండుపల్లి టౌన్‌లో ఎ2జడ్ మొబైల్ షాప్‌ను వైసీపీ నాయకులు జి. మదన్ మోహన్ రెడ్డి, యర్రపురెడ్డి అజయ్ రెడ్డి, యర్రపు రెడ్డి అజంతమలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యర్రపురెడ్డి ఆరంరెడ్డి, రెడ్డిచెర్ల ధనుంజయ, చిన్నగొల్లపల్లి సర్పంచ్ రామ జయచంద్ర, సీనియర్ నాయకులు యస్. కరీంభాష, బద్రి రమేష్, రషీద్, కల్లూరు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సచివాలయాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అట్లూరు : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బద్వేల్ ఎమ్మెల్యే దా.సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిలు పేర్కొన్నారు. గురువారం అట్లూరు మండలంలోని మన్యంవారిపల్లె (కమలకూరు), మాడపూరు గ్రామ సచివాలయాలతో పాటు రూ.కోటి 15లక్షలతో బీటీ రోడ్డుకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనులు చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే నూతన సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయడం జరుగు తుందన్నారు. సచివాలయంలో ప్రజలకు ఉపయోగపడే పీఎం కిసాన్, ఈకెవైసీ, విద్యుత్ బిల్లులు, పాన్‌కార్డు, ఆధార్, రైల్వే, బస్సు ఛార్జీలు తదితర సేవలను రైతులకు సంబందించి రెవెన్యూ సేవలను ప్రతి రోజు 3 గంటల నుంచి 5వరకు స్పందన అర్జీలు కూడా స్వీకరిస్తారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సచివాలయం ద్వారా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పోతిరెడ్డి రెడ్డయ్య, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అందూరి రామకృష్ణారెడ్డి, మన్యంవారిపల్లె ఉపసర్పంచ్ మల్లికార్జునరెడ్డి, సీనియర్ నాయకులు గంగిరెడ్డి, నాయకులు ఉపత్తి సుబ్బారెడ్డి, ఉపత్తి గంగిరెడ్డి, పొత్తపి నరసింహ, పెంచలయ్య, అగ్రహారం నరసారెడ్డి, బ్రహ్మారెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, మాడపూరు సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, పరందామరెడ్డి, బద్వేల్ మండల నాయకులు పెద్దపోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల నియామకం

విశాలాంధ్ర -రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయితీ కొండవాండ్లపల్లి చెందిన పోలిమాని రెడ్డయ్య తెలుగు యువత ఉపాధ్యక్షులుగా. చిట్లూరు పంచాయతీ హరిజనవాడ చెందిన పోశాల మల్లికార్జున మండల ప్రధాన కార్యదర్శిగా ఎంపికైనట్లు వారు తెలిపారు. రామపురంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చూడాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి అరేచకాలు చూడలేక ప్రజలు సహించలేక పోతుతున్నారని .ప్రజలు తెలుగుదేశం వైపు ముగ్గు చూపుతున్నారు అన్నారు మాపై నమ్మకంతో. ఈ పదవులు ఇచ్చినందుకు తెలుగుదేశం పోలేట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస్ రెడ్డికి రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ రమేష్ రెడ్డికి. రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు కొవ్వూరు దివ్య కుమార్ రెడ్డి కి వారు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్ జైల్లో టీడీపీ కార్యకర్తల్ని పరామర్శించిన టీడీపీ నేతలు నల్లారి, కిషోర్

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు సబ్ జైల్లో టీడీపీ కార్య కర్తల్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, పుంగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి వారిని కలుసుకొని పరామర్శించారు. నాయకుల రాకతో పుంగనూరు, పీలేరు నియోజకవర్గ పరిధిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సబ్ జైలు దగ్గరికి చేరుకొన్నారు.సబ్ జైల్లో ఉన్న పిల్లల తల్లిదండ్రులు పెద్దఎత్తున సబ్ జైల్ వద్దకుతరలివచ్చారు.అనంతరం సబ్ జైల్లో ఉన్న పిల్లల తల్లిదండ్రులను వారు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. మా పిల్లలపై 307 లాంటి హత్యాయత్నం, మర్డర్ కేసుల్లో ఇరికించడం తగదని వారి గోడు వెళ్ల బోసుకున్నారు. మహిళలు లబబా నోరుకొట్టుకొని బిడ్డల భవిష్యత్తు పాడు చేస్తున్నారని,పిల్లల చదువులు, పరీక్షలు సర్వ నాశనం చేశారని మా ఉసురు వైకాపా నాయకులకు తగులు తుందని భోరు మంటూ విలపించారు.మేము కూడా కొన్నేళ్ళుగా రాజకీయాలు చూశాము గాని పిల్లలపై కేసులు నమోదు చేసి నీచ, నికృష్ట రాజకీయాలు మేము ఎప్పుడు చూడలేదని వా పోయారు.అదే విధంగా కిషోర్ కుమార్ రెడ్డి, రామచంద్రా రెడ్డి లు మాట్లాడుతూ, మీరు ఎవ్వరు కేసులకు భయపడే అవసరం లేదు మీకు మీ పిల్లకు మీ కుటుంబాలకు టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సంక్రాంతి క్రికెట్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-కెవిపల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల, యువకులకు మూడురోజుల పాటు అన్నీ పంచాయితీలలో క్రికెట్‌ఆటలో ఆసక్తి వున్న యువతరం కోసం రాష్ట్ర ఏపీ డీఎంసీ హరీష్ రెడ్డి టోర్నమెంట్ ను ప్రారంభించారు. అనంతరం గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రౌండ్లో, మండల నాయకుల సమక్షంలో, యువకులతో కలిసి ఆటను కొంత సేపు బ్యాట్‌తో బాలునుకొట్టి ప్రారంభించారు. గురువారం, శుక్రవారం, శనివారం ఈమూడు రోజులలో అన్ని టీంలు బాగా ఆడీ మ్యాచ్లో విజేతగా నిలిచిన జట్టుకు మొదటీ బహుమతి, 21,116, రెండవ బహుమతి, 10,116 బహూమతులు మండల పార్టీ కన్వీనర్, ఏంపీపీ, జేడ్పీటీసీ, మండల యువజన యూత్, లీడర్లు, చేతుల మీదుగా బహూమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

టిబి గురించి భయం వద్దు..నయమవుతుంది

-డాక్టర్ చంద్రశేఖర్ నాయక్

విశాలాంధ్ర-పీలేరు: 'క్షయ రోగికి మానసిక మద్దతు నిచ్చి,వ్యాధి నిర్మూలకు సహరిద్దాం ..'అని డాక్టర్లు చంద్రశేఖర్ నాయక్ డాక్టర్ సుబ్రమణ్యం సంయుక్తంగా పిలుపు నిచ్చారు. గురువారం ముడుపుల వేముల గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్టులో భాగంగా డాక్టర్ల బృందం సమీప విద్యానగర్ లో క్షయ వ్యాధిగ్రస్తులను పలకరించారు టి.బి. (క్షయ) ఒక ప్రమాదకర అంటు వ్యాధి అని,అవగాహన లోపం, పేదరిక,పొగ తాగుట, మద్యం సేవించడం, పోషకాహార లోపం, అధిక జనాభా నివసించే ప్రాంతాల్లో క్షయ వ్యాధి అధికంగా వ్యాపిస్తుం దని,వ్యాధిగ్రస్తుడు దగ్గున్నప్పుడు తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా గాలిలో 'మైక్రో బాక్టీరియా ట్యూబర్ క్యూలోసిస్', వ్యాధికారక క్రిములు ద్వారా టిబి ఆరోగ్య వంతుడికి సోకుతుందని.వ్యాధికి బలమైన మందులతో నివారణ ఉందని,ఇందుకు రోగికి కుటుంభం పూర్తి మానసిక మద్దతు అవసరమని,, డాట్స్ విధానములో ఇంటివద్దే బలమైన మందులతో ఉచిత చికిత్స పూర్తిగా నయమవు తుందని,ఛాతీ నొప్పి,బరువు తగ్గడం,ఆకలి మంద గించడం, జ్వరం,వారానికి మించి దగ్గు, లక్షణాలు ఉన్నచో దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తేమడ పరీక్ష (గళ్ళ) ద్వారా ఉచిత వ్యాధి నిర్ధారణ, ఉచిత చికిత్స పొందాలని,ప్రస్తుతం అవగాన లోపముతోనే వ్యాధి వ్యాప్తి ఆందోళన కలిగించే అంశమని, డాక్టర్ చంద్రశేఖర్ తెలుపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రమణ్యం, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య,సి.హెచ్.ఓ. నాగముత్యం, పర్యవేక్షకులు పవన్ కుమార్,ఏ. యన్.యం వసుందర, వెంకటరత్నం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ రాష్ట్రానికిలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా

విశాలాంధ్ర - కమలాపురం : నగర పరిధిలోని ఆరో వార్డు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి వైసిపి వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను, విధ్వంసకర పాలనను, మహిళలకు ప్రజలకు వివరిస్తూ ప్రజలు, మైనారిటీ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అభిప్రాయాలు తెలుసుకొని పార్టీ ఇచ్చిన అభిప్రాయ సేకరణ పత్రంలో వివరములు సేకరించి పార్టీ నిర్దేశించిన ఫోన్ నెంబర్ 9261292612 కి మిస్డ్ కాల్ ఇప్పిస్తూ టిడిపికి ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరిన పుత్తా నరసింహారెడ్డి అనంతరం 6వ వార్డు టీడీపీ కౌన్సిలర్ రిహన ఏర్పాటుచేసిన మైనార్టీ మహిళల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో సామాన్యమైన ప్రజలపై పన్నుల భారం పెంచి నిత్యావసర వస్తువుల ధరలు పెంచి, సామాన్య ప్రజలపై వైసీపీ ప్రభుత్వం పెనుబారం మోపిందన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, ద్వారా మద్యం, ఇసుక,అమ్మకాల ద్వారా, నిత్యవసర వస్తువుల రేట్లు పెంచడం ద్వారా కరెంటు భారం మోపి ప్రజల పైన విపరీతంగా పన్నులు వేయడం జరుగుతోంది వీటిని అన్నింటిని కమలాపురంలో మహిళలకు, నిరుద్యోగులకు, విద్యార్థులకు,ప్రజలకు అన్ని వర్గాల వారికి వివరిస్తూ వారి ద్వారా ప్రభుత్వం ఎంత లబ్ది పొందుతున్నదో వారికి ప్రభుత్వం ద్వారా ఎంత లబ్ధి వస్తుందో గణాంకాలతో సహా వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబు ముఖ్యమంత్రి పగ్గాలు చేపడితే తప్ప రాష్ట్రం బాగుపడదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గమనించి ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీని బలపరిచి చంద్రబాబుని ముఖ్యమంత్రి చేసేందుకు మీ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

కమలాపురం పట్టణంలో ఎలాంటి ఉపాధి లేక 3000 మంది తమ జాబ్ కార్డులు కోల్పోవడం జరిగిందని, ఇవన్నీ గమనించి ప్రజలు వచ్చే ఎన్నికల్లో వైసిపి నాయకులకు గుణపాఠంచెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుడు అరెస్టు

విశాలాంధ్ర-కడప క్రైం : నాప్టోల్‌లో లాటరీ తగిలిందంటూ ప్రోసెసింగ్ ఛార్జీల పేరిట అమాయక ప్రజల నుండి డబ్బులు దోచుకుంటున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మోస్ట్ వాంటెడ్ సైబర్ క్రిమినల్ శంకర్ మండల్ అనే కరుడు గట్టిన అంతర్ రాష్ట్ర సైబర్ నేరస్తుడిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రొద్దుటూరు వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి వద్ద నుండి రూ.16 లక్షల మేర ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు ఖాతాకు పలు దఫాలుగా డబ్బులు దండుకుని సైబర్ మోసగాళ్లు మోసం చేశారన్నారు. బాధితుడు ప్రొద్దుటూరు టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అంతర్ రాష్ట్ర సైబర్ నేరగాడు శంకర్ మండల్ ను అరెస్టు చేశామన్నారు. శంకర్ మండల్ పై దేశవ్యాప్తంగా 100కు పైగా ఫిర్యాదు లు... అందులో 44 ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు అయ్యాయన్నారు. ఆంధ్రప్ర దేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రలలో మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. 23 బ్యాంక్ ఖాతాల ద్వారా రూ.12 కోట్ల మేరకు బాధితులను మోసం చేసినట్లు సైబర్ క్రైమ్ గుర్తించిందన్నారు. ప్రొద్దుటూరు వన్ టౌన్‌తో పాటు విశాఖపట్నంలో రెండు కేసులు, చిత్తూరు జిల్లాలో ఒక కేసు నమోదు అయ్యిందన్నారు. కేసును తదుపరి చర్యలకు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్, ఐటికి సిఫారసు చేశామన్నారు.